వార్త
ఆదివారం
3 సెప్టెంబరు 2017

mohan PUBLICATIONS
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.
Mohanpublications.com
SUNDAY SPECIAL MAGAZINES
గ్రంథనిధి

తారాతీరం

ఫ్యాక్షన్ లీడర్ పాత్రలో..

100 సినిమాలు పూర్తవ్వగానే నందమూరి నటసింహం బాలయ్య గ్యాప్ లేకుండా సినిమాలను మంచి ఊపుతో తెరకెక్కిస్తున్నారు.. ఇప్పటికే ఓ సినిమాను రిలీజ్‌కి రెడీగా ఉంచిన ఆయన మరో సినిమాను స్టార్ట్ చేసేశారు.. అంతేకాకుండా మరో రెండు కథలను కూడ లైన్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. అయితే గత సినిమాల్లో ఆడి పాడిన హీరోయిన్లతో బాలయ్య మళ్లీ వారితో చిందులేయటానికి రెడీ అయిపోయారు. పైసావసూల్ సినిమాతో శాతకర్ణి తర్వాత శ్రియతో చిందేస్తున్న బాలయ్య ఇపుడు కొత్తగా తెరకెక్కుతున్న చిత్రంలో నయనతారతో మూడోసారి జోడీ కట్టనున్నారు.. కెఎస్ రవికుమార్ దర్శకత్వంలో వీరిద్దరూ కలిసి నటించనున్నారు. ఈ సినిమాలో నయన్ ఓ ఫ్యాక్షన్ లీడర్‌గా కన్పించబోతున్నారట.. బాలయ్యకు జోడీగా ఇద్దరు హీరోయిన్లు నటిస్తుండగా, నయన్ మాత్రం యాక్షన్ సన్నివేశాలలో బాలయ్యతో పోటీపడనుందట..

రొమాంటిక్ మూవీలో ఛాన్స్

గత ఏడాది రిలీజ్ అయిన మజ్ను మూవీలో నటించింది ప్రియశ్రీ.. తన అందంతోపాటు అభినయంతోనూ ఆడియన్స్‌ను ఆకట్టుకుని, అరంగేట్రంలోనే సక్సెస్ అందుకున్న ఈ భామకు అవకాశాలకు కొదువేమీ లేదు.. కానీ ఈ బ్యూటీ స్క్రిప్ట్ సెలక్షన్‌లో బాగా ఆచితూచి వ్యవహరిస్తుందనే టాక్ ఉంది. మోడల్‌గా కూడ వెలుగులు విరజిమ్ముతున్న ఈ ముంబై భామ ఇపుడు తెలుగు సినిమాకు సైన్ చేసింది..

మతులు పోగొడుతోంది

ఏ ముహూర్తాన టాలీవుడ్‌లోకి 'ఇష్టం' అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చిందోగానీ సౌత్‌లో అందరికీ ఇష్టమైన హీరో యిన్‌గా మారిపోయింది శ్రియ. దాదాపు టాలీవుడ్‌లో స్టార్ హీరోలందరితో స్క్రీన్ షేర్ చేసుకున్న ఈ భామ గత కొంతకాలంగా సినిమాలను తగ్గించేసింది.. నచ్చిన చాన్సులతోనే మెప్పిస్తూ తనదైన శైలిలో హిట్ అందుకుంటూ ప్రస్తుత హీరోయిన్స్‌కి దీటుగా అందాలను ఆరబోస్తోంది. రీసెంట్‌గా 'పైసా వసూల్' ఆడియో వేడుకలో ఈ ముద్దుగుమ్మ వేసుకున్న డ్రెస్ అందరినీ ఆకట్టుకుంది.. మూడు పదుల వయసొచ్చినా..ఇంకా అందాలను రెట్టింపు చేసుకుందనిపిస్తోంది.. ఎక్కడికీ వెళ్లినా క్లీమేజ్‌షోతో మతులు పోగొడుతోంది.. అంతేకాకుండా ఇటీవల ఓ ఫ్యాషన్ షోలో కూడ మోడల్స్‌కు దీటుగా క్లీమేజ్ అందాలను ఆరబోసింది..

కె.లీలా సువర్ణ

www.drpositive.in
An ISO 9001 - 2000 Certified ®
The art of healing
పాజిటివ్ హోమియోపతి
డాక్టర్‌ని తరచూ మారుస్తున్నారా ?
తగ్గని జబ్బులకు పాజిటివ్ హోమియోపతి ద్వారా సరైన పరిష్కారం
కాల్ చేయండి : 90 30 56 11 55
అస్తమా అలర్జీ
◆ సైనసైటిస్ ◆ తుమ్ములు ◆ అస్తమా ◆ స్కిన్ అలర్జీ ◆ తరుచు జలుబు
కీళ్ళ నొప్పులు
◆ నడుం నొప్పి ◆ మెడ నొప్పి ◆ కీళ్ళ వాపులు ◆ సయాటికా ◆ గౌట్ ఆర్థరైటిస్
డయాబెటిస్
◆ కాళ్ళ మంటలు ◆ గుండె సంబంధ సమస్యలు ◆ అంగస్తంభన సమస్యలు
థైరాయిడ్
◆ హైపర్, హైపో థైరాయిడ్ ◆ పిల్లలు పుట్టకపోవడం ◆ బరువు పెరగడం ◆ గాయిటర్
సోరియాసిస్
◆ ఎగ్జిమా ◆ అర్టికెరియా ◆ తెల్లమచ్చలు ◆ అన్ని రకాల చర్మ సంబంధిత వ్యాధులు
సంతానలేమి
◆ ఫిమేల్ ఇన్‌ఫెర్టిలిటి ◆ మేల్ ఇన్‌ఫెర్టిలిటి ◆ PCOD ◆ థైరాయిడ్ ◆ స్త్రీ సమస్యలు
HELP! HELP!
కిడ్నీ స్టోన్స్
◆ రీనల్ ఫెయిల్యూర్ ◆ నడుము నొప్పి ◆ గాల్ స్టోన్స్ ◆ మూత్రంలో రక్తం
పైల్స్
పైల్స్, ఫిస్టులా & ఫిషర్స్ సమస్యలకు పూర్తి చికిత్స
మరింత సమాచారం కొరకు టోల్ ఫ్రీ : 1800 108 1900
బేగంపేట | అమీర్‌పేట | జూబ్లిహిల్స్ | కాచిగూడ | కూకట్‌పల్లి | విక్రమ్‌పురి
A.S.రావు నగర్ | దిల్‌సుఖ్‌నగర్ | మెహిదీపట్నం | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం | తమిళనాడు

ఆదివారం వార్త

3 సెప్టెంబరు 2017

విషయ విశేషం

'సంఘీ'భావం
బూటకపు బాబాలకు గుణపాఠం!..... 5
మూడో కన్ను
మహిళా విజయం......6
కవర్‌స్టోరీ
కాలుష్య తెరల వెనుక
వాహ్..తాజ్!...8
ఆసాంతం సాహిత్య సేవకే అంకితం....12
ప్రేమ కథామాలిక
మాతృఘోష జలపాతమై..14
ఉష గాత్రం హుషారుగా గ'మ్మత్తుగా'!.....18
కలరియపట్టులో బామ్మగారి పట్టు!....19
కథ
తరాల అంతరాలు 20
ఈవారం కవిత్వం
అన్నదాతా! సుఖీభవ!!....23

మంచి ముత్యాలు

ఈ ప్రపంచంలో
మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవడానికి
ఒకే ఒక మార్గం ఉంది.
అదే అంతరాత్మ.

-ఆల్డస్ హక్స్ లీ

చిత్రభారతి
దేశభక్తి చిత్రాలను బతికించలేమా?
...30
ఇంకా..కృతి, మొగ్గ, నవ్వుల్.. రువ్వుల్,
వాస్తు వార్త, పదమథనం ..వారఫలం..
వగైరా... వగైరా.

లేఖలు

ఆలోచింపజేసింది.

ఆగస్టు 13 వార్త ఆదివారం అనుబంధంలో కవర్ కథనం 'యూత్..భారత్ భవిత' మమ్మల్ని ఆలోచింపజేసింది. యువతలో ప్రగతి శీలురను, పెడతోవ పడుతున్నవారినీ చూడవచ్చని చక్కగా చెప్పారు. ఏమైనా దేశ భవితకు యువత శక్తిమంతంగా, సమున్నతంగా ఉండటం ఎంతైనా అవసరం. ఆలోచింపజేసే ఆర్టికల్‌ను అందించిన మీకు మా ధన్యవాదాలు.

-డి.జగదీశ్, హైదరాబాద్.

'మూడోకన్ను' ఆకట్టుకుంది..

ఆగస్టు 13 వార్త ఆదివారం అనుబంధంలో మూడోకన్ను శీర్షికన 'రంగుమారుతోంది' ఆర్టికల్ నన్ను అమితంగా ఆకట్టుకుంది. గతంలోని రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతుల కథనంతోపాటు వెంకయ్యగారి ఎన్నికలలోని తీరును బాగా వివరించారు. వెంకయ్యగారు అనంతపురానికి గతంలో ఎన్నికల ప్రచారానికి వచ్చినపుడు ఆయన ఉపన్యాసం వినే భాగ్యం కలిగింది. అనర్గళంగా ఉపన్యసించి జనాన్ని ఉర్రూతలూగించారు. ఆయన తెలుగు వాడు కావటం మనకెంతైనా గర్వకారణం.

-కైప. నాగరాజు, అనంతపురం.

మేగజైన్ నచ్చింది..

వార్త ఆదివారం మేగజైన్ ఆగస్టు 13 సంచికలో భావవీచిక-నాదీ స్వతంత్రదేశం, నాదీ స్వతంత్రజాతి అని మనసుల్లో మార్మోగేలా చేసింది. కృష్ణ, గోదావరి నదులకు లివింగ్ స్టేటస్ ఇవ్వాలన్న 'సంఘీ'భావంఎంతో బాగుంది. కవర్ స్టోరీ..భారత్ భవిత, యువ తప్పై ఉందని గుర్తుచేసింది. 'హలో ఫ్రెండ్' ద్వారా ఎన్నో విజ్ఞానదాయక అంశాలు తెలుసు కోగలిగాం. ఈవారం కార్టూన్స్ నైస్. ఉత్తరాంచల్ పూలలోయ కనువిందుచేసింది.

-నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖ.

ఆద్యంతం చదివించింది..

ఆగస్టు 13 వార్త ఆదివారం మేగజైన్‌లో కవర్‌స్టోరీలో ఇచ్చిన స్ఫూర్తిమూర్తుల వివరాలు ఉత్తేజకరంగా ఉన్నాయి. అలాగే 'అమావాస్యకు వెన్నెలొచ్చింది కథ' ఎంతో బాగుంది. ఈ వారం కవిత్వంలో 'కత్తి-కలము' కవిత, కత్తి కన్నా కలం గొప్పదని చక్కగా తెలిపింది.

-కన్నెగంధ్ల హరనాథ్, నర్సరావుపేట.

ముచ్చటైన మేగజైన్

ఆగస్టు 13 వార్త ఆదివారం మేగజైన్‌లో అంశాలన్నీ నచ్చాయి. భావవీచికలో స్వాతంత్ర్యం గురించిన సందేశం బాగుంది. జలవనరుల సద్వినియోగమే దేశప్రగతికి మూలాధారమని 'సంఘీ'భావంలో చక్కగా చెప్పారు. 'అమావాస్యకు వెన్నెలొచ్చింది' కథ టైటిలే కథ చక్కగాసాగడానికి సగం కారణమైంది. ఈవారం అందించిన కవితలన్నీ ఆకట్టుకున్నాయి.

-డా.శివభూషణం, కర్నూలు;
పక్కి రాధాగోపాలకృష్ణ, విశాఖ.

భావ వీచిక

అక్షరం..అక్షయం..

అక్షర సంపద అక్షయమైంది. అంటే తరిగిపోనిది. అటువంటి అక్షరశక్తి ప్రతి వ్యక్తికి ఉండితీరాలి. అంటే ప్రతి వ్యక్తి అక్షరాస్యుడు కావాలి. యునెస్కోవారు సెప్టెంబరు 8వ తేదీని అంతర్జాతీయ అక్షరాస్యత దినంగా దాదాపుగా యాభై ఏళ్ల కిందట ప్రకటించారు. మనిషికి ఆహారం ఎంత అవసరమో, చదువు అంతే అవసరం. ఆహారం శారీరక పుష్టికి తోడ్పడితే, చదువు మనిషి మేధను పెంచుతుంది. యునెస్కో ప్రకారం ప్రపంచంలో 250 మిలియన్ పిల్లలకు సరిగా చదవటం, రాయటం రాదు. ప్రపంచలోని నిరక్షరాస్యులలో మూడు వంతుల మంది ఇండియా, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా, ఇథియోపియా, ఈజిప్ట్, బ్రెజిల్, ఇండోనేషియా, కాంగోలలో ఉన్నారు. ఐరాస విశ్లేషణ ప్రకారం ప్రతి 5గురు వ్యక్తుల్లో ఒకరు నిరక్షరాస్యులు. భారత్‌లో అక్షరాస్యత రేటు వృద్ధి మందకొడిగా ఉంది. యునెస్కో నివేదిక ప్రకారం అందరికీ చదువు లక్ష్యాల సాధన ఇండియాలో యాభై ఏళ్లు ఆలస్యమవుతుంది. యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్ట్ ప్రకారం భారత్, సార్వజనీన ప్రాథమికవిద్యను 2050లో, లోయర్‌సెకండరీ విద్యను 2060లో, అప్పర్ సెకండరీ విద్యను 2085లో సాధించగలదు. గణాంకాల మాట ఎలా ఉన్నా మనదేశంలో అందరికీ అక్షరాస్యత ఇప్పటికీ అందకుండానే ఉందన్నది నిజం. అక్షరాస్యత విషయంలో కేరళ రాష్ట్రం ప్రథమస్థానంలో నిలిస్తే, బీహార్ చివరి స్థానంలో నిలుస్తోంది. ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా పల్లెలో బడిబాట పట్టిన పిల్లలు సైతం అనేకానేక కారణాల వల్ల మధ్యలోనే బడి మానేస్తున్నారు. చదువు ప్రాధాన్యత గురించిన చైతన్యం పల్లెల్లో అంతంతమాత్రంగానే ఉంది. ప్రతి విద్యావంతుడు మరికొందరిని విద్యావంతులను చేయడానికి కంకణం కట్టుకుంటే తప్ప అందరికీ అక్షరాస్యత కాగితాలకే పరిమితమవుతుంది. కేవలం అక్షరాస్యత మాత్రమే కాదు, ప్రమాణాలతో కూడిన, ప్రయోజనకరమైన విద్యనందించటం కూడా ఎంతో ముఖ్యం. నామ్‌కే వాస్తే చదువు కాకుండా సార్థకమైన చదువు ఎంతైనా అవసరం. 'చదువు, చదివించు' అన్నదే మన నినాదం కావాలి!

'సంఘీ'భావం

బూటకపు బాబాలకు గుణపాఠం!

దేశంలో న్యాయం ఇంకా బతికే ఉందని హర్యానాలోని సిబిఐ ప్రత్యేక కోర్టు జస్టిస్ జగదీప్‌సింగ్ నిరూపించారు. బాధితుల పేర్లను పదిహేనేళ్ల వరకు బయట పెట్టకుండా నాలుగు రాష్ట్రాలలో రాజ్యాంగేతర శక్తిగా సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన డేరా చీఫ్ గుర్మీత్‌రామ్‌రహీమ్ సింగ్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఆ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు దేశ న్యాయ చరిత్రలోనే మరో సంచలనమని చెప్పక తప్పదు.

పార్టీలను, ప్రభుత్వాలను, రాజకీయ నేతలను, పోలీసులను కనుసైగతో దశాబ్దాలుగా శాసిస్తున్న డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్‌కు ఎన్ని బెదిరింపులు, వత్తిడులు వచ్చినా హింసా, విధ్వంసం చెలరేగి 38 ప్రాణాలను బలిగొన్నా ఏమాత్రం భయపడకుండా శిక్షనే కాకుండా బాధితులకు నష్టపరిహారం చెల్లించమని అతను గురువు కాదు... ఆటవిక మృగమని సాహసోపేత తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి జగదీప్ సింగ్ పేరు న్యాయచరిత్రలో ఎవరూ మర్చిపోలేనిది. అంతేకాకుండా క్షమాభిక్ష అడిగినా దయాదాక్షిణ్యాలు చూపమని భోరున ఏడ్చినా, కోర్టు హాలునుంచి కదలని గుర్మీత్‌ను సెక్యూరిటీతో ఈడ్చి బయట పారేసి చట్టంముందు ఎవరూ అతీతులు కాదని జగదీప్‌సింగ్ అసాధారణ రీతిలో నిరూపించారు. చట్టబద్ధ పాలనను ఎవరు సవాల్ చేసినా వారికి గుర్మీత్‌కు పట్టిన గతే పడుతుందని న్యాయమూర్తి తన తీర్పుద్వారా తెలియజేశారు. అసలు క్షమాభిక్షకు గుర్మీత్‌సింగ్ అర్హుడు కాదని కూడా జగదీప్‌సింగ్ వ్యాఖ్యానించడం న్యాయచరిత్రలోనే అరుదైన విషయమని న్యాయనిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అయిదు కోట్ల మంది దుందుడుకు స్వభావ డేరా సభ్యులతో పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో విస్తరించిన డేరా సామ్రాజ్యాన్ని జగదీప్‌సింగ్ ఒకే ఒక తీర్పుతో కుప్పకూల్చారు.

దేశంలో పుట్టగొడుగుల్లా వీధికొకరుగా వెలుస్తున్న బూటకపు బాబాలకు, గుర్మీత్ సింగ్‌కు విధించిన శిక్ష గుణపాఠమని చెప్పక తప్పదు. తనపై భక్తి విశ్వాసాలతో దేవుడిగా భావించి తన దగ్గరికి వచ్చిన ఇద్దరు సాధ్వీలను బెదిరించి అత్యాచారం చేసిన సంఘటన పదిహేనేళ్ల క్రితంది. ఈ రెండు సంఘటనల్లో గుర్మీత్ ఆటవిక రేప్‌లకు గురైన ఇద్దరు బాధిత సాధ్వీలు ఆయన ఆశ్రమం నుంచి బయట పడి తాము డేరాల్లో సాక్షాత్తు దేవుడనబడే గుర్మీత్ చేతిలో ఎలా అత్యాచారానికి గురయ్యారో వివరిస్తూ ఆకాశరామన్న లేఖలు అన్ని రాజ్యాంగ వ్యవస్థలకు రాశారు. తమ జీవితాలను నాశనం చేసిన గుర్మీత్‌పై చట్టపర చర్యలను తీసుకోవాలని వారు పేర్లు చెప్పకుండా రాసిన లేఖలను ఫిర్యాదులుగా స్వీకరించాలని రాజకీయ నాయకులను, మీడియాను, పోలీసులను, న్యాయస్థానాలను కోరారు. ఇందులో పోలీసులు గుర్మీత్ ప్రభావానికి భయపడి ముందుకు రాలేదు. రాజకీయ నాయకులు గుర్మీత్ ఓటు బ్యాంకుకు భయపడి బాధితుల లేఖలను చెత్తబుట్టలో పడేశారు. చివరకు ఓ జర్నలిస్టు స్పందించి తన పత్రికలో ఆకాశ రామన్న లేఖలను ప్రచురిస్తే అతన్ని గుర్తు తెలియని వ్యక్తులు కొద్ది రోజుల్లోనే కాల్చిపారేశారు.

ఇక ఉన్నత న్యాయస్థానం బాధితుల ఆకాశ రామన్న లేఖలను సుమోటో ఫిర్యాదులుగా స్వీకరించి సిర్సా జడ్జిచేత ప్రాథమిక విచారణను జరిపించింది. ఆ జడ్జి నిష్పాక్షికంగా విచారణ జరిపి బాధితులపై గుర్మీత్ రేప్ చేసింది నిజమేనని న్యాయపరంగా శిక్షించాలంటే ఎవరికీ లొంగని సిబిఐకి దర్యాప్తును అప్పజెప్పాలని సూచించారు. దీంతో సిబిఐ రంగంలోకి దిగి బాధితులను రహస్యంగా విచారించి సాక్ష్యాలను సేకరించి మొత్తం బాబా బండారాన్ని జస్టిస్ జగదీప్‌సింగ్ ముందు బయట పెట్టారు. దీంతో ఆయన బాధితులకు జరిగిన తీవ్ర అన్యాయంపై మానవీయ కోణంలో స్పందించారు. అనూహ్య రీతిలో ఆయన ఈ కేసులో గుర్మీత్ దోషి అని నిర్ధారించారు. తీర్పుకు రెండు రోజుల గడువు పెట్టారు. ఈ లోపే గుర్మీత్ మూఢభక్తులు నాలుగు రాష్ట్రాల్లో హింస, విధ్వంసం పెచ్చరిల్లింపచేసి 38 మంది ప్రాణాలను బలిగొన్నారు. చట్టాన్ని చుట్టంగా చేసుకొని దహన కాండకు పాల్పడి నాలుగు రాష్ట్రాలనే కాకుండా దేశాన్నే వణికించారు. చివరకు హైకోర్టు ఈ విధ్వంసాన్ని నిలువరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తీవ్రంగా వ్యాఖ్యానించడంతో ప్రభుత్వాలు మిలటరీని రంగంలోకి దింపి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఆ తరువాత జడ్జి జగదీప్‌సింగ్‌ను హెలికాప్టర్‌లో తీసుకెళ్లి జైల్లోనే తీర్పు ప్రకటింపచేశారు. ఇందులో పదిహేనేళ్ల తరువాత బాధితులకు న్యాయం జరిగినా ఇది న్యాయచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన అధ్యాయమని చెప్పక తప్పదు.

అయితే బాబాల పేరిట, దేవుళ్ల పేరిట, దేవదూతల పేరిట దేశంలో ఇప్పటికీ అనేక చోట్ల అరాచకాలు సాగుతున్నాయి. పోలీసుల, రాజకీయ నేతల కనుసన్నల్లో వారి అక్రమార్జనకు బూటకపు బాబాల ఆశ్రమాలే నిలయాలుగా మారుతున్నాయి. ఈ చీకటి ఆశ్రమాల్లో అంధవిశ్వాసాలతో చేరే అనేక మంది ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. దేశం భిన్నత్వంలో ఏకత్వానికే ప్రతీక కాకుండా మూఢాచారాలకు అంధ విశ్వాసాలకు కూడా కేరాఫ్‌గా నిలిచింది. ప్రజల్లో మూఢ విశ్వాసాలు పోనంతకాలం బాబాలు వర్ధిల్లుతూనే ఉంటారు.

గుర్మీత్‌సింగ్‌లాంటివారు సేవ, ఆధ్యాత్మికం ముసుగులో సమాంతర నేర సామ్రాజ్యాలను నడుపుతున్నారు. వీరు డబ్బు, అధికార అహంతో అత్యాచారాలే కాకుండా హత్యలకు సవాలక్ష చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పోలీసులు డబ్బుకు ఆశపడి వీరికి రక్షణ ఇస్తుంటే రాజకీయ నేతలు బాబాల ఓటుబ్యాంకుకు భయపడి మద్దతు ఇస్తున్నారు. చివరకు మీడియా లేదా న్యాయస్థానాలే బాబాలే చీకటి బాగోతాలను బయట పెడుతున్నాయి. డేరా చీఫ్ గుర్మీత్‌ను దోషిగా నిర్ధారించడం వెనుక సినిమా ఫక్కీలో ఎన్నో బెదిరింపులు, వత్తిళ్లు, హత్యలు, అరాచకాలు జరిగాయి. అయినా ఈ కేసులో నేర నిర్ధారణ శాస్త్రీయంగా జరగడం, బెదిరింపులకు లొంగకుండా శిక్ష పడడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయస్థానాల నిఘాకు భయపడి నిష్పాక్షికంగా పని చేయడం దేశ చరిత్రనే మలుపు తిప్పే పరిణామమని చెప్పక తప్పదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

మహిళా విజయం..

– ఎ.వి.వి. ప్రసాద్

తలాక్ పద్ధతి 14 శతాబ్దాలుగా అమలవుతోందనీ, దానిని మార్చరాదనీ ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదించగా, ఖురాన్‌కు వ్యతిరేకంగా ఇస్లాం ఉండజాలదని జస్టిస్ జోసెఫ్ చేసిన వాదనపట్ల మెజారిటీ ముస్లిం పెద్దలుకూడా హర్షం ప్రకటించడం గమనించవలసిన అంశం. ముమ్మారు తలాక్‌తో విడాకులు తీసుకోవడం రాజ్యాంగంలోని 14వ అధికరణం ప్రసాదిస్తున్న సమానత్వ హక్కు ఉల్లంఘన కిందకే వస్తుందని జస్టిస్ నారిమన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన విడిగా మరో తీర్పు కూడా రాశారు. తలాక్ అనే ఒక విడాకుల విధానానికి వ్యతిరేకంగా ఇంత సంచలనాత్మక తీర్పు వెలువడడం దేశంలో ఇదే మొదటిసారి. భార్యాభర్తలు పశ్చాత్తాపం చెందితే తిరిగి వెనక్కిరాలేని ఆ విధానం ఇక చెల్లుబాటు కాకూడదన్నదే సుప్రీం తీర్పులోని ప్రధానమైన అంశం. ఆ తీర్పు అంత పకడ్బందీగా రావడానికి తెర వెనుక పనిచేసింది కూడా ముస్లిం మహిళలే కావడం గమనించవలసిన మరో అంశం.

లాకు పడెను త్రయ తలాకుకు కోర్టున
ముస్లిము మహిళలకు మోదమలర;
విషము చిమ్మెడి మత విశ్వాసమేలయా!
విశ్వవినుత నామ! వినురవేమ!!

సామాజిక రుగ్మతలకు కళ్లెం వేయడం చాలా కష్టం. అవి ఏ మతానికి సంబంధించినవైనా కావచ్చు. రకరకాల కాలాల్లో అనేకరకాల దురాచారాలు అన్ని మతాల వారిలోనూ ప్రబలిన విషయం చరిత్ర మనకు చెబుతూనే ఉంది. వాటిని అరికట్టడానికి, ప్రజల హృదయాలలో పరివర్తన తేవడానికి ఆయా కాలల్లో ఎందరో సంఘ సంస్కర్తలు ప్రభవించడం, వారి వల్ల ఎంతో కొంతమార్పు సమాజంలో వచ్చి కొన్ని రకాల దురాచారాలు తెరమరుగుకావడం మనం అనేకం చూశాం కూడా. అయితే ఇప్పుడు అలాంటి సంఘ సంస్కర్తలంటూ రావడం కూడా కష్టమే. ఒక రాజా రామ్‌మోహన్ రాయ్, మరో కందుకూరి వీరేశలింగం వంటివారు గతకాలంలో సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసి కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. వారే లేకుంటే ఎన్ని సతీ సహగమనాలు ఇంకా జరుగుతుండేవో కదా! ఆలోచిస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. బాల్యవివాహాలు వేల సంఖ్యలో జరుగుతున్న కాలం నుంచి బయటకు రావడానికి మనకు కొన్ని దశాబ్దాలు పట్టింది. గురజాడ వంటి మహాకవులు తమ కలాన్ని ఝళిపించవలసివచ్చింది. ఆనాటి పూర్ణమ్మ కథ వింటూ ఉంటే ఇప్పటికీ అందరి హృదయాలు ద్రవిస్తాయి. కనులు చెమ్మగిల్లుతాయి. అటువంటి కాలంనుంచి, ఎన్నో దురాచారాల నుంచి ఎందరో మహనీయుల నిర్విరామకృషి ఫలితంగా బయటకు వచ్చి ఇవాళ మహిళా లోకం స్వేచ్ఛగా, ఆకాశమే హద్దుగా విజయాలను అందుకొంటోంది.

అయితే ముస్లిం మహిళల భవిష్యత్తును మాత్రం 'ముమ్మారు తలాక్' ఇంకా ముసుగులోనే ఉంచుతోంది. దాన్ని తమ ఆచారంగా భావించేవారు ఉండవచ్చు. కానీ మహిళలు దానివల్ల ఎన్ని ప్రమాదాల్లో చిక్కుకొంటున్నారో, ఎన్ని దురవస్థలకు గురవుతున్నారో చెప్పడానికి కూడా సాధ్యంకాని పరిస్థితి. ఆ కట్టుబాటు ముసుగులో తమ జీవితాలను త్యాగంచేయలేరు, దానిని తొలగించుకొని బయటకు రాగల సాహసమూ చేయలేరు. వారిని వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించే సంఘసంస్కర్తలూ ఇప్పుడు ఎవరూలేరు. అందుకే సామాజిక రుగ్మతలను గుర్తించి వాటికి చికిత్స చేసే బాధ్యతను కోర్టులే తలకెత్తుకుంటున్నాయి. ప్రస్తుతం సంఘ సంస్కర్తలు న్యాయస్థానాలే. సర్వోన్నత న్యాయస్థానం తలచుకొంటే ఏ సామాజిక రుగ్మత అయినా పరుగుతీయవలసిందే. ఆ బాధ్యతలో భాగంగానే సుప్రీంకోర్టు, ఆగస్టు 22న ముమ్మారు తలాక్‌పై కొరడా ఝళిపించింది. దాన్ని ఒక దురాచారంగా భావిస్తూ, ముస్లిం మహిళల జీవితాలకు ఒక కొత్త 'భానూ'దయాన్ని ప్రసాదించింది. ఒక్క ట్రిపుల్ తలాక్ మాత్రమే కాదు- నిఖాహలాలా, బహుభార్యాత్వం వంటివి రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయనీ, ముస్లిం మహిళల జీవితాలు చీకటిలోనే తెల్లారిపోతున్నాయనీ కేంద్రం చేసిన వాదనలను సుప్రీంకోర్టు పూర్తిగా సమర్థించింది. అలాగే కొందరు ముస్లిం మహిళలు చేస్తున్న న్యాయపోరాటానికి కూడా సర్వోన్నత న్యాయస్థానం చేయూతనిచ్చింది. దాని ఫలితమే ట్రిపుల్ తలాక్ చెల్లబోదంటూ ఇచ్చిన తీర్పు. ఆ సమస్యకు కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన పరిష్కారాన్ని చూపించాలంటూ ఆదేశించింది. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం లోని ఇద్దరు న్యాయమూర్తులు ఆ దురాచారం ఇక చెల్లదంటూ తీర్పు చెప్పి ముస్లిం మహిళా లోకానికంతటికి అండగా నిలబడ్డారు. ముమ్మారు తలాక్ చెప్పడం ద్వారా చాలా తేలికగా విడాకులిచ్చే పద్ధతి ఎంతమాత్రం న్యాయసమ్మతంకాదనీ, అది రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు సైతం విరుద్ధమనీ తేల్చిచెప్పారు. ఏ మతంలోనైనా వివాహానికి, దాంపత్య జీవనానికి చాలా ప్రత్యేకమైన స్థానం ఉన్నదని సుప్రీంకోర్టు ఆ తీర్పు ద్వారా దేశంలోని ప్రజలందరికి మరోసారి చెప్పినట్లయింది. వివాహానికి గల పవిత్రతను, శాశ్వతత్వాన్ని, ముస్లింల పవిత్రగ్రంథమైన ఖురాన్‌లోనూ ప్రత్యేకంగా చెప్పిన విషయాన్ని న్యాయమూర్తులు ఆ సందర్భంగా పేర్కొనడం గమనించవలసిన అంశం. తమ తీర్పు ఖురాన్ నియమ నిబంధనలకు అనుగుణంగానే ఇస్తున్నట్లు వారు చెప్పారు. జస్టిస్ లలిత్, జస్టిస్ నారిమన్, జస్టిస్ జోసెఫ్‌లు వెల్లడించిన తీర్పులో అత్యంత అరుదైన సందర్భాలలో మాత్రమే తలాక్‌ను అనుమతించాలన్న నిబందన ఖురాన్‌లోనే ఉన్న విషయాన్ని కోట్ చేశారు. తలాక్‌కు అనుమతించాల్సిన సందర్భంలో కూడా రాజీకి మరోమారు ప్రయత్నం జరగాలనీ, అది ఫలిస్తే విడాకులను వెనక్కి తీసుకోవాలనీ ఖురాన్‌లో ఉన్నట్లు వారు తమ తీర్పులో చెప్పారు.

షాయిరా బానో

ఆ వ్యాఖ్యలు చాలు... ఇంత కాలం ముస్లిం మహిళలు ఎంతటి కష్టమైన, దట్టమైన 'ముసుగు'లో ఉన్నారో చెప్పడానికి. 3-2 ఆధిక్యంతో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 395 పేజీల ఈ తీర్పును వెలువరించగానే మన దేశంలోనే కాదు, ప్రపంచంలోని

అనేకానేక ముస్లిం దేశాల నుంచి కూడా హర్షధ్వానాలు వినిపించాయి. ముమ్మారు తలాక్‌తో విడాకులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆరు పిటిషన్లు దాఖలు కాగా, వాటిపై విస్తృతంగా విచారణ జరిపి ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. ముమ్మారు తలాక్‌ను చాలా కాలం నుండి మతపరమైన ఆచారంగా పాటిస్తున్నందున దానిని ఆరు నెలలపాటు నిలిపివేసి, ప్రభుత్వం ఈలోగా ఒక చట్టం చేయడం మేలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, జస్టిస్ అబ్దుల్‌నజీర్ అభిప్రాయం వ్యక్తం చేయగా, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ నారిమన్, జస్టిస్ లలిత్‌లు మాత్రం దానితో ఏకీభవించకుండా తలాక్ విధానం రాజ్యాంగ అతిక్రమణే అని తీర్పు చెప్పారు. 'ముమ్మారు తలాక్‌తో పాటు ఖురాన్ మూల సూత్రాలకు విరుద్ధమైనదేదైనా అది రాజ్యాంగ విరుద్ధమే, దానిని రద్దు చేయవలసిందే' అని వారు చెప్పిన తీర్పు ఇక ముస్లిం మహిళలను కొత్త అభ్యుదయ బాటలో నడిపిస్తుందనుకోవలసిందే.

****

తలాక్ పద్ధతి 14 శతాబ్దాలుగా అమలవు తోందనీ, దానిని మార్చ రాదనీ ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదించగా, ఖురాన్‌కు వ్యతిరేకంగా ఇస్లాం ఉండజాలదని జస్టిస్ జోసెఫ్ చేసిన వాదనపట్ల మెజారిటీ ముస్లిం పెద్దలుకూడా హర్షం ప్రకటించడం గమనించవలసిన అంశం. ముమ్మారు తలాక్‌తో విడాకులు తీసుకోవడం రాజ్యాంగంలోని 14వ అధికరణం ప్రసాదిస్తున్న సమానత్వ హక్కు ఉల్లంఘన కిందకే వస్తుందని జస్టిస్ నారిమన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన విడిగా మరో తీర్పు కూడా రాశారు. తలాక్ అనే ఒక విడాకుల విధానానికి వ్యతిరేకంగా ఇంత సంచలనాత్మక తీర్పు వెలువడడం దేశంలో ఇదే మొదటిసారి. భార్యాభర్తలు పశ్చాత్తాపం చెందితే తిరిగి వెనక్కిరాలేని ఆ విధానం ఇక చెల్లుబాటు కాకూడదన్నదే సుప్రీం తీర్పులోని ప్రధానమైన అంశం. ఆ తీర్పు అంత పకడ్బందీగా రావడానికి తెర వెనుక పనిచేసింది కూడా ముస్లిం మహిళలే కావడం గమనించవలసిన మరో అంశం.

నిత్యవేధింపులకు తోడు, ముమ్మారు తలాక్ చెప్పి భర్త ఏకపక్షంగా వదిలించుకొనే దురాచారాన్ని ఇక సాగనివ్వబోమంటూ తిరుగుబాటు బావుటా ఎగురవేసింది కూడా ఆ ముస్లిం మహిళలే. అందుకే దానిని మహిళలకోసం మహిళలు సాధించిన విజయంగా చెప్పవచ్చు. షాయరా బానో, అఫ్రీన్ రెహమాన్, గుల్షన్‌పర్వీన్, ఇష్రత్ జహాన్, అతియా సబ్రి అనే ఐదుగురు ముస్లిం మహిళలు సుదీర్ఘ కాలం జరిపిన న్యాయ పోరాటం ఫలితంగా మొత్తం ముస్లిం మహిళలందరు కొత్త జీవితంలోకి అడుగు పెట్టినట్లయింది.

ఆ ఐదుగురు మహిళలను వారి భర్తలు వదిలించుకొన్న తీరు చూస్తే నిజానికి ఎవరికైనా ఆగ్రహం కలిగి తీరుతుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన షాయరా బానోను ఆమె భర్త పెళ్లయిన పదిహేనేళ్ల తర్వాత జస్ట్ మూడు సార్లు తలాక్ చెప్పి వదిలించుకున్నాడట. రాజస్థాన్‌కు చెందిన అఫ్రీన్ రెహమాన్ అనే మహిళ పరిస్థితి మరింత దయనీయం. పెళ్లయిన రెండు మూడు నెలలకే ఆమెకు అత్తవారింటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. అదనపు కట్నంకోసం వారు తీవ్రమైన ఒత్తిడి చేశారనీ, తనకు అనేకసార్లు ఆత్మహత్య చేసుకోవా లనిపించిందనీ, ఒకరోజు హఠాత్తుగా భర్త స్పీడ్ పోస్ట్‌లో మూడు సార్లు తలాక్ అని రాసి తనకు పంపాడనీ, అలా తన వైవాహిక జీవితం విచ్ఛిన్నమైపోయిందనీ ఆమె సుప్రీంకోర్టుకు తెలిపింది.

ఉత్తర ప్రదేశ్‌లోని గుల్షన్ పర్వీన్ అనే మహిళకు భర్త ఓ స్టాంప్ పేపర్‌పై తలాక్‌నామా రాసి పంపాడుట. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇష్రత్ జహాన్ అనే మహిళకు భర్త ఫోన్‌లో ముమ్మారు తలాక్ చెప్పేసి మరో మహిళను పెళ్లి చేసుకొన్నాడట. ఇది ఇంకా ఘోరం. యుపికే చెందిన మరో మహిళ అతియా కథ మరింత విషాదకరం అనిపిస్తుంది. ఆమెకు పెళ్లయి, ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత భర్త 25 లక్షలు పుట్టించి నుంచి తేవాలంటూ డిమాండ్ చేశాడట. అది ఆమె తేలేక పోవడంతో ఓ చిన్న కాగితం ముక్కపై మూడు సార్లు తలాక్ అని రాసేసి ఆమెను వదిలివెళ్లిపోయాడట. ఇలాంటి దీనావస్థలో ఎందరో ముస్లిం మహిళలు తమ జీవితాలను అర్పిస్తుండడం తరచుగా వివాదాస్పదమవుతున్నా ఆ ఐదుగురు ముస్లిం మహిళలు వేసిన పిటిషన్లతో సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం విస్తృతంగా విచారణలు జరిపి ఎట్టకేలకు ఆ సంచలన తీర్పు వెలువరించింది.

అప్పుడు షాబానో, ఇప్పుడు షాయరా బానో. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం 1985లో షాబానో బేగం కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎంత సంచలనం సృష్టించిందో ఇప్పుడు షాయరా బానో విషయంలో ఇచ్చిన తీర్పు అంతకుమించిన సంచలనం కలిగించింది. ఖురాన్‌లోగాని, షరియత్‌లోగాని లేని విధానాన్ని అనుసరిస్తూ మహిళల హక్కులను తృణీకరించే విధంగా పురుషులు వ్యవహరించడమేమిటని పలు హక్కుల సంఘాలు కూడా గతంలో కోర్టులకెక్కాయి. అయితే కొందరు పిడివాదుల వల్ల ఆ దురాచారం ఇంతకాలం కొన సాగుతూనే వచ్చింది. ఆవేశంలో, మద్యం మత్తులో తలాక్ చెప్పినా అది అమలు కావడమేమిటని ఇంతకుముందు కూడా కొందరు మహిళలు కోర్టులను ఆశ్రయించారు. అయితే ముస్లిం లా బోర్డు ఆ వాదనలను అంగీకరించకపోవడంతో ఆ మహిళల బతుకులు ఇప్పటికీ అలా చీకటిలోనే మగ్గిపోతూ వచ్చాయి.

ముస్లిం మహిళల హక్కులు, పర్సనల్ లాకు సంబంధించి షాబానో కేసు మొదలు గత నాలుగు దశాబ్దాలుగా చాలా రకాల వివాదాలే కొనసాగు తుండడం గమనార్హం. ఏ మతస్తులయినా చట్టం ముందు సమానులే అనే సత్యం ఒక్కొక్కసారి తెరమరుగవుతూండడంతో ఎందరో మహిళలు ఎన్నో కేసుల్లో పరిష్కారం లభించక అలమటిస్తూనే ఉన్నారు. అయితే షాబానో కేసులో తొలిసారి ఒక ముస్లిం మహిళకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పురావడంతో అప్పటినుంచి అనేకమంది మహిళలనుంచి కోర్టులకు, సుప్రీం కోర్టుకు కూడా పిటిషన్లు దాఖలవుతూ వచ్చాయి. 1985లో షాబానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆ తర్వాత అనేక మహిళా సంఘాల ఉద్యమాలకు కొత్త ఊపిరినిచ్చిందని కూడా చెప్పాలి. నిజానికి కరడు కట్టిన ఇస్లాంవాదం ఉన్న ముస్లిం దేశాల్లో కూడా ఈ తలాక్ విధానాన్ని ఎప్పుడో రద్దుచేసినపుడు మనదేశంలో మాత్రం ఎందుకు? అనే ప్రశ్న ముస్లిం మహిళల గళాల నుంచి అధికంగా వినిపించడం కూడా సుప్రీంకోర్టును కొంత ప్రభావితం చేసినట్లు కనిపిస్తుంది. ఈజిప్ట్, ఇండోనేసియా, ఇరాన్, మరికొన్ని అరబ్ దేశాలలో కోర్టుల ద్వారా మాత్రమే విడాకులు పొందే విధానాన్ని అనుసరిస్తున్నారు.

చివరికి పాకిస్థాన్‌లో కూడా సివిల్ కోర్టుల్లో మాత్రమే విడాకులు తీసుకొనే పద్ధతి అమలులో ఉంది. సిరియా, జోర్డాన్, సూడాన్ వంటి ఇస్లామిక్ దేశాల్లోనూ ట్రిపుల్ తలాక్ విధానం లేదు. అందుకే సుప్రీం తీర్పును గౌరవించి ముస్లిం మహిళల జీవితాలలో వెలుగులు నింపే పని ఇక కేంద్రం, ఆ మత పెద్దల చేతుల్లోనే ఉంది. కేంద్రం తగిన విధంగా చట్టాన్ని రూపొందిస్తే ముస్లిం మహిళల హక్కులకు మరింత రక్షణ కలిగించినట్లవుతుంది. చట్టం ఉంటే సుప్రీంకోర్టు మరింత సమర్థంగా దానిని కాపాడగలుగుతుంది.

కాలుష్య తెరల వెనుక..

వాహ్..తాజ్!

కవర్ స్టోరీ

జె.శ్యామల

భారత్ పేరు చెప్పగానే అంతర్జాతీయంగా అందరికీ గుర్తువచ్చేది తాజ్ మహల్. భారత్‌కు వచ్చే విదేశీ పర్యాటకులు చూడాలని కలలు కనేది, తప్పనిసరిగా చూసి వెళ్లేది తాజ్‌మహల్‌నే. అలనాడు మొగల్ పాదుషా షాజహాన్, తన అర్ధాంగి ముంతాజ్ స్మృతి చిహ్నంగా నిర్మింపజేసిన అపురూప కట్టడం తాజ్. నిత్యం వివిధ వేళల్లో వైవిధ్య సౌందర్యంతో విరాజిల్లే తాజ్ ఈమధ్యకాలంలో కాలుష్యం కాటుకు గురై పాలవన్నె తగ్గి పసుపు వన్నెకు మారుతోందని అంతా ఆందోళన చెందుతున్నారు. అరుదైన తాజ్‌ను కాలుష్యం కోరలనుంచి పరిరక్షించు కోవలసిన బాధ్యత మనపై ఉంది. ఒక్క తాజ్ మాత్రమే కాదు..మరెన్నో ప్రసిద్ధి చెందిన చారిత్రక కట్టడాలు కాలుష్యం కారణంగా పతనం కావటం గమనించవలసిన అంశం. ఈ చారిత్రక కట్టడాలపై పర్యావరణ కాలుష్యం ఏ విధంగా ప్రభావం చూపిస్తోంది, తాజ్ నిర్మాణ నేపథ్యం, ప్రత్యేకత, మరికొన్ని చారిత్రక కట్టడాల స్థితిగతులు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీరుతెన్నులు, చేపడుతున్న నివారణ చర్యలతో కూడిన సమగ్ర కథనం ఈవారం మీకోసం...

పర్యావరణ కాలుష్యం చారిత్రక కట్టడాలను సైతం కాటేస్తోందన్న ఆందోళన గత కొన్నేళ్లుగా అందరిలో ఆందోళన కలిగిస్తోంది. భారతీయులందరికీ గర్వకారణమైన తాజ్‌మహల్ కాలుష్యం బారిన పడి వన్నె తగ్గుతోందని పాలరాతి తెల్లదనం, పసుపువన్నెగా పతనమవుతోందని గగ్గోలుపెట్టడమూ తెలిసిందే. అయితే అభివృద్ధి పనులంటూ తలపెట్టే కొన్ని పనులు కాలుష్య నియంత్రణకు విఘాతం కలిగించడం జరుగుతోంది.

తాజాగా ఉత్తర ప్రదేశ్‌లోని మధుర, ఢిల్లీల మధ్య రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం 400 చెట్ల కూల్చివేత విషయమై సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ప్రపంచ విఖ్యాతిగాంచిన తాజ్‌మహల్‌ను నాశనం చేయదలచుకొన్నారా? అంటూ తీవ్రంగా ప్రశ్నించింది. ఇటీవలి తాజ్ ఫొటోలను గమనించారా. ఒకసారి ఇంటర్నెట్‌లో చూడండి అంటూ జస్టిస్ మదన్ బి లోకుర్, దీపక్ గుప్తాలతో కూడిన బెంచ్ పేర్కొంది. పర్యావరణవేత్త ఎమ్‌సి మెహతా ఈ విషయమై పిటిషన్ వేశారు. తాజ్ సమీపాన 80కి.మీ. పొడవున ఉన్న 450 చెట్లను తొలగిస్తేకానీ అదనపు ట్రాక్ నిర్మాణం సాధ్యం కాదన్నది అధికారుల వాదన. ఈకేసు కొద్దిరోజుల్లో విచారణకు రానుంది. మెహతా తన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంలో కాలుష్య వాయువుల నుంచి, వన నిర్మూలననుంచి తాజ్‌కు రక్షణ కల్పించాలని కోరారు. గతంలో అపెక్స్ కోర్టు తాజ్ పరిరక్షణకు కొన్ని ఆదేశాలు జారీచేసింది.

గత సంవత్సరం పర్యావరణ కార్యకర్త డి.కె. జోషి ఆగ్రాలో మున్సిపల్ చెత్తను పెద్దఎత్తులో అక్కడే తగులపెట్టడం వల్ల తాజ్ మహల్ పాల తెలుపు పసుపు వన్నెకు మారుతోందని కేసు వేశారు. ఐఐటి కాన్పూర్, జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌ల సంయుక్త పరిశోధలో ధూళితో పాటు వచ్చే బ్రౌన్, బ్లాక్ కార్బన్లు పాలవన్నె తాజ్‌ను పసుపురంగుకు మారుస్తున్నట్లు తేలిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆగ్రాలో అధికారులు చెత్త పారిశుధ్య చట్టాలను అతిక్రమించి రోజూ సిటీలోని వివిధ ప్రాంతాలలో 2000 మెట్రిక్ టన్నులకు పైగా చెత్తను కాల్చి వేస్తున్నారని వివరించారు. పైగా

పరిశ్రమలనుంచి వచ్చే, ప్రమాదకర, బయో మెడికల్ వ్యర్థాలను వేరుచేయకుండా ఏకమొత్తంగా కాల్చేయడం సంవత్సరాలుగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

కాలువలు, మురుగు కాల్వల నీరు ఎటువంటి శుద్ధిక్రియ లేకుండానే యమునానదిని చేరుతోందని, నగర్ నిగమ్ ఆగ్రా, ఆగ్రా డెవలప్‌మెంట్ అథారిటీ, కంటోన్మెంట్ బోర్డులు ఈ అంశాన్ని విస్మరిస్తున్నాయని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు.

జోషి ఫిర్యాదుకు ప్రతిస్పందించవలసిందిగా కేంద్రాన్ని కోరారు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారు. అంతేకాకుండా గ్రీన్ పానెల్ వారు తాజ్ ట్రెపెజియమ్ జోన్‌లో మున్సిపల్ చెత్తను తగులబెట్టే పనులు చేయకుండా నిరోధించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ స్వతంతర్ కుమార్ నేతృత్వంలోని బెంచ్ పర్యావరణం, అడవుల మంత్రిత్వ శాఖకు, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి నోటీసులు జారీచేసింది కూడా.

తాజ్..షాజహాన్ ప్రేమ చిహ్నం

అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన తాజ్‌మహల్ నిర్మాణం కావించింది మొగల్ పాదుషా షాజహాన్. 1628లో షాజహాన్ మొగల్ సింహాసనాన్ని అధిష్టించాడు. ఆయన ప్రియ సతీమణి ముంతాజ్ మహల్. ఆమె అసలు పేరు అర్జుమంద్ బాను బేగం. 1631లో ముంతాజ్ మహల్ 14వ కాన్పులో అకాల మరణం చెందింది. ఆమె జ్ఞాపకార్థమే షాజహాన్ 1632లో ఆగ్రాలో యమునా నదీతీరాన 42 ఎకరాల విస్తీర్ణంలో ఓ స్మారక చిహ్నా నిర్మాణం తలపెట్టాడు. అదే తాజ్‌మహల్. ఇదిగాక ఈ ఆవరణలో ఓ మసీదు, గెస్ట్ హౌస్, ఉద్యానవనాలు ఉన్నాయి.


వెన్నెల వేళ పాలవన్నెల తాజ్

తాజ్ ప్రధాన రూపకర్త (ఆర్కిటెక్ట్) ఉస్తద్ అహ్మద్ లాహౌరి. తాజ్ నిర్మాణం పూర్తికావటానికి 2 దశాబ్దాలకాలం పట్టింది. ఇండియా, పర్షియా, యూరప్ వగైరాలకు చెందిన దాదాపు 20,000మంది శ్రామికుల కృషి, నైపుణ్యాలతో తాజ్ రూపుదిద్దుకుంది. 1000 గజరాజులు కూడా ఈ నిర్మాణంలో పాలుపంచుకున్నాయి. ఎత్తు 73మీ. నాలుగు మూలల నాలుగు చిన్న మినరెట్స్. ఇస్లామ్ సంప్రదాయం ప్రకారం ఆర్చిలపై ఖురాన్ సూక్తులను చెక్కారు.

లోపల, కింద ముంతాజ్, షాజహాన్‌ల అసలు సమాధులున్నాయి. పై అంతస్థులో ఫాల్స్ టూంబ్ ఉంది. తాజ్ సముదాయానికి ముందున్న ప్రధాన ద్వారం రెడ్ శాండ్‌స్టోన్‌తో నిర్మితమైంది. తాజ్‌మహల్ నిర్మాణానికి అయిన వ్యయం అప్పటి లెక్కల్లో 32 మిలియన్ల రూపాయలు. 2015 లెక్కల్లో అయితే అది సుమారు 52.8 బిలియన్ రూపాయలకు సమానమైంది. షాజహాన్ తనకోసం కూడో మరో గొప్ప సమాధి యమునా నది ఒడ్డునే నిర్మించుకోవాలని, తన మరణానంతరం తన భౌతికకాయాన్ని అక్కడే సమాధిచేయాలని తలచాడని ఓ కథనం. ఆ రెండు నిర్మాణాలను ఓ బ్రిడ్జితో కలపాలన్నది ప్రణాళిక.

కానీ షాజహాన్ మూడో కుమారుడైన ఔరంగజేబ్ అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని 1658లో పదవీచ్యుతుణ్ణి చేసి, అధికారం తనంతతానే కైవసం చేసుకున్నాడు. షాజహాన్ తన జీవితపు చివరి రోజుల్లో ఎర్రకోటలోని ఓ టవర్‌లో గృహ నిర్బంధంలో ఉండి, తాను ముంతాజ్‌కోసం నిర్మించిన తాజ్‌మహల్‌నే అక్కడినుంచి వీక్షిస్తూ కాలం గడిపేవాడట.

షాజహాన్ మరణానంతరం తాజ్‌మహల్‌పై నిర్లక్ష్యం నీడలు పరచుకున్నాయి. ఎవరూ పట్టించుకున్నదే లేదు. 19 శతాబ్దపు మలుపులో బ్రిటిష్ వైస్రాయ్ ఆఫ్ ఇండియా లార్డ్ కర్జన్ తాజ్ మహల్ కళా వైశిష్ట్యాన్ని గుర్తించి, దాన్ని పదిల పరచాలనే ఉద్దేశంతో మరమ్మతులకు ఆదేశించాడు.

ప్రస్తుతం ఏటా 3 మిలియన్ల మంది దేశ, విదేశీ పర్యాటకులు తాజ్‌మహల్‌ను సందర్శిస్తున్నారు. 1983లో యనెస్కోవారు తాజ్‌మహల్‌కు వరల్డ్ హెరిటేజ్ సైట్ హోదా నిచ్చారు. పరిసర ప్రాంతాలలో ఉన్న కర్మాగారాల కారణంగా గాలి కాలుష్య ప్రభావం తాజ్‌మహల్‌పైపడి పాలరాతి కట్టడం వన్నె తగ్గసాగింది. 1998లో సుప్రీంకోర్టు తాజ్ పతనం కాకుండా ఉండేందుకు ఎన్నో పరిరక్షణ చర్యలకు ఆదేశించింది. ఫలితంగా తాజ్ పరిసరాలలోని కొన్ని ఫ్యాక్టరీలను మూసివేశారు. అలాగే ఆ చుట్టుపట్ల వాహనాల రాకపోకలను నిషేధించారు.

దాడుల సమయంలో తాజ్ భద్రత..

1942లో జపాన్ వాయు సేనల దాడులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తాజ్‌మహల్ రక్షణకోసం, దాన్ని మరుగుపరుస్తూ చుట్టూ పరంజాలను ఏర్పాటు చేసింది. అలాగే ఇండో-పాక్ యుద్ధ సమయాల (1965,1971)లో పరంజాలు ఏర్పాటుచేసింది.

అయితే యుద్ధాల ముప్పు కన్నా ఇటీవలి కాలంలో తాజ్‌మహల్‌కు పర్యావరణ కాలుష్యం ముప్పే ఎక్కువైంది. యమునానది కాలుష్యం, మధురా ఆయిల్ రిఫైనరీల వల్ల ఏర్పడే ఆమ్ల వర్షాలు, వాయుకాలుష్యం తదితరాలు పెచ్చుమీరి తాజ్ తాజాదనాన్ని కోల్పోతోంది. తాజ్ రక్షణకోసం ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు తాజ్ ట్రేపిజియమ్ జోన్ (టిటిజడ్)ను ఏర్పాటుచేసింది. దీని పరిధిలో అంటే తాజ్ చుట్టూ 10,400 చ.కి.మీ.మేర పర్యావరణ చట్టాలను కఠినంగా వర్తింపజేస్తారు.

యమునా నది బేసిన్‌లో భూగర్భజలాల స్థాయి ఏడాది దాదాపు 1.5 మీ. (5 అడుగులు) తగ్గడంతో తాజ్ భద్రత గురించిన ఆందోళన వ్యక్తమైంది. 2010లో టూంబ్‌పై పగుళ్లు కన్పించాయి.

తాజ్- ఆగ్రా కా పేటా

తాజ్ పరిసరాల్లో వాతావరణ కాలుష్యానికి గల కారణాల్లో ఆగ్రాలో తయారయ్యే ప్రసిద్ధ స్వీటు ఆగ్రా కా పేటా కూడా ఒకటని తేల్చారు. బూడిద గుమ్మడికాయతో తయారుచేసే ఈ స్వీటుకు దేశమంతటా ఎనలేని ఆదరణ ఉంది. ఆగ్రాలోని పేటా తయారీదారుల్ని బొగ్గుల వంటపొయ్యికి బదులు ఎల్‌పిజి స్టవ్‌లను వాడమని, లేదంటే షాపుల్ని మూసేయమని అధికారులు ఆదేశించటంతో ఎంతోమంది ఉపాధికోల్పోయారు.

అయినా తాజ్ వన్నె తగ్గటం తగ్గలేదు. ఇందుకు కారణం వాహనాలనుంచి, ఇతర కాలుష్యకారక పరిశ్రమలనుంచి వెలువడే బ్లాక్ అండ్ ఆర్గానిక్ కార్బన్ రవ్వలే కారణమని అభిప్రాయపడ్డారు. అన్నిటికన్నా పెద్ద ముప్పు పాలరాతి తాజ్ మహల్‌లో నిత్యం అసంఖ్యాక సందర్శకుల పదఘట్టనలు. ఒక్కోరోజు సందర్శకులు 50,000కుపైగా ఉంటారు. రహదారులకోసం, ఇతర అవస్థాపనలకోసం ఇటీవలి సంవత్సరాలలో ఆగ్రా పరిసరాలలో పెద్ద సంఖ్యలో చెట్లను కూల్చారు. ఆగ్రా సెమి ఎరిడ్ జోన్‌లో ఉంది. అందువల్ల ఇక్కడ వేసవి ఉష్ణోగ్రతలు 49 డిగ్రీల సెల్సియస్‌ను చేరుకుంటుంటాయి. మార్బుల్‌లోని ఖనిజ మాలిన్యాలు ఆక్సైడ్‌తో చర్య జరపటంతో గోధుమ రంగు మరకలు ఏర్పడుతున్నాయి. భారీ వర్షాల వల్ల వాతావరణంలో వచ్చే మార్పు మార్బుల్‌పై ప్రభావం చూపటంతో పగుళ్లు ఏర్పడుతున్నాయి. మార్బుల్ స్లాబుల అమరికకోసం వాడిన ఇనుప సామాగ్రివల్ల తుప్పు పట్టి వర్షాలలో అది కరిగి కారి, మార్బుల్‌పైకి చేరుతోంది. వేడి ధూళిగాలులు మార్బుల్‌పై ఒరిపిడి ప్రభావం చూపుతున్నాయి.ఈ ధూళి కాలుష్యాన్ని అరికట్టడానికి చెట్లను విరివిగా పెంచటం, పరిసరాలలో జలాశయాలను ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలి.

తాజ్ హెరిటేజ్ కారిడార్, ది రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ (ఆగ్రాఫోర్ట్‌నుంచి తాజ్ వరకు ఫుడ్ ప్లాజాలు, మాల్స్ కూడినవి)లు.. ఇవి తాజ్‌కు ముప్పుతెస్తాయని..ఆ నిర్మాణాలను నిలిపివేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేయడంతో ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది.

యమున ఒడ్డున పోగయ్యే ఇసుక, ఇసుక తుఫానుల సమయాల్లో తాజ్‌పై ఎగిసిపడటం జరుగుతోంది. దీని నివారణ కూడా ఆలోచించవలసి ఉంది.

కాలుష్య ముప్పులో మరికొన్ని చారిత్రక కట్టడాలు

పర్యావరణ కాలుష్యం కోరల్లో చిక్కుకున్న చారిత్రక కట్టడాలలో తాజ్‌మహల్‌తో పాటు ఢిల్లీలో కల్కాజి ప్రాంతంలో ఉన్న లోటస్‌టెంపుల్, ఇండియా గేట్, అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్, మన భాగ్యనగరం లోని చార్మినార్ వగైరాలున్నాయి. వాహనాలు, పరిశ్రమల వల్ల విడదలయ్యే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు గాలిలోని తేమతో చర్య జరపటంతో ఆసిడ్లు తయారై, అవి మార్బుల్‌ను తినేస్తూ, అవి క్రమంగా రంగుకోల్పోటానికి కారణమవుతున్నాయి.

ఢిల్లీలో పాలరాయితో నిర్మితమైన లోటస్ టెంపుల్ శిల్పకళా వైశిష్ట్యానికి ఓ మచ్చుతునక. బహాయిలకు ఆరాధ్యం, గర్వకారణం కూడా. అటువంటి లోటస్ టెంపుల్ పర్యావరణ కాలుష్యదాడితో వాడిపోవటం అందరినీ కలవరపరిచే విషయం. ప్రపంచం మొత్తంమీద ఉన్న ఏడు బహాయి మందిరాలలో ఢిల్లీలోని లోటస్ టెంపుల్ ఒకటి. గ్రీసులోని ప్రాచీన నిర్మాణాలకు వాడిన పోరస్ పెంటెలికాన్ మార్బుల్స్‌నే లోటస్ టెంపుల్ నిర్మాణానికి వాడారు. 1986లో నిర్మితమైన లోటస్ టెంపుల్‌కు 27 మార్బుల్ పూరేకులు ఎంతో అందంగా ఉంటాయి. 21,000 మీ. విస్తీర్ణంలో నెలకొంది. ప్రతినెలా 400,000 మంది సందర్శకులు వస్తుంటారు. అయితే దీని చుట్టూ ఉన్న పరిసరాలలో ఎన్నో చిన్న పరిశ్రమలు, మురికివాడలు వగైరాలున్నాయి. అందువల్లే సంరక్షణ చర్యలు ఎప్పటికప్పుడు చేపడుతున్నా పాలరాయి కళను కోల్పోతోంది. పరిస్థితి తీవ్రత ఎంతగా ఉందంటే కొద్ది సంవత్సరాలలో మొత్తం టెంపుల్ గ్రే కలర్‌కు మారిపోవచ్చని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పేర్కొంది. పర్యావరణ అంశాలపై దృష్టి కేంద్రీకరించే సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్

ఇండియన్ పార్లమెంట్ 2010లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ యాక్ట్‌ను తెచ్చింది. 2011 నుంచి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) పనిచేయడం ఆరంభించింది. గత ఆరేళ్ల ఎన్‌జిటి వందలాది కేసులను చేపట్టింది. దేశం ఎదుర్కొంటోన్న పర్యావరణ సంక్షోభ నేపథ్యంలో, ఎన్‌జిటి ఏర్పాటుతో ఈ సమస్యను కనీసం కొంతమేరకైనా అదుపుచేయటానికి దేశంలోనే తొలిసారిగా ఓ స్వతంత్రమైన, బాధ్యతాయుతమైన సంస్థ ఒకటి అందుబాటులోకి వచ్చినట్లయింది. రియో డిక్లరేషన్‌లో భారత్ కమిట్‌మెంట్‌లో భాగంగానే ఎన్‌జిటి ఏర్పాటు జరిగింది.

సంక్లిష్టమైన పర్యావరణ సమస్యల పరిష్కారానికి జడ్జిలు, నిపుణులతో కూడిన స్వతంత్రమైన న్యాయ వ్యవస్థ ఉండాలని సుప్రీంకోర్టు గతంలో ఎన్నోసార్లు నొక్కి వక్కాణించింది. ది లా కమిషన్ ఆఫ్ ఇండియా కూడా తన 186వ నివేదికలో దేశంలో పర్యావరణ న్యాయస్థానాలు ఉండాలని సూచించింది.

లోటస్ టెంపుల్ ప్రాంతంలోని ట్రాఫిక్ కారణంగా, కార్లనుంచి వెలువడే కాలుష్యవాయువులు, చుట్టుపట్ల మురికి వాడల్లో రబ్బర్, ప్లాస్టిక్‌లను కాల్చడం, దగ్గర్లోని పవర్ ప్లాంట్‌లో బొగ్గు, గ్యాస్‌ల వాడకం వల్ల అవశేషంగా వెలువడే ఫ్లై యాష్ మొదలైనవి లోటస్ టెంపుల్‌ను దెబ్బతీస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఇక మన భాగ్యనగరంలోని పాతనగరంలో నెలకొన్న నాలుగు వందల ఏళ్ల నాటి చారిత్రక అద్భుత కట్టడం చార్మినార్‌కు సైతం పర్యావరణ కాలుష్య ప్రభావం తప్పలేదు. చార్మినార్‌పై ధూళి పొరలు, వాహనాల కాలుష్యం చార్మినార్‌ను వెలిసిపోయేలా చేస్తోంది.

ఇక్కడి వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వారు తమ అధ్యయనంలో నగర టిఎస్‌పిఎమ్ (టోటల్ సస్పెండెడ్ పర్టిక్యులేట్ మాటర్..గాలిలోని ధూళికొలత) స్థాయి చార్మినార్ ప్రాంతంలో అత్యధికంగా ఉందని తెలియజేశారు. గాలి కాలుష్యానికి త్వరగా గురయ్యే నిర్మాణ సామగ్రి జాబితా కూడా వారు ఇచ్చారు. అందులో మార్బుల్, లైమ్‌స్టోన్, స్టీల్ మొదటి మూడుస్థానాల్లో ఉన్నాయి.

భారత్ వాయువ్యంలో ఎంతగానో అభివృద్ధి చెందిన, పారిశ్రామికీకరణ చెందిన రాష్ట్రం పంజాబ్. సిక్కులు అతి పవిత్రంగా భావించే స్వర్ణ దేవాలయానికి కాలుష్య తాకిడి తప్పలేదు, స్వర్ణదేవాలయ కాంతి తగ్గడం గమనించి, రక్షణ చర్యలను చేపడు తున్నారు. 2013లో పంజాబ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ఢిల్లీ అధ్యయనం జరిపి, ట్రాఫిక్, పరిశ్రమలు, పరిసరప్రాంతాలలోని రెస్టారెంట్లలోని ఓవెన్లు స్వర్ణదేవాలయ ధగధగాయమానమైన స్వర్ణకాంతుల్ని తగ్గించేస్తున్నాయి. వాస్తవానికి స్వర్ణ దేవాలయ పాకశాల సైతం ఇంధన సమస్యనెదుర్కొంటోంది. 2014 చివరలో కాలుష్య నియంత్రణ మండలి దేవాలయంపై కాలుష్య ప్రభావ స్థాయిని లెక్కించడానికి ఓ మానిటరింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం, స్వర్ణదేవాలయ పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలను, పదిహేనేళ్లకంటే పాతవైన కార్లను నిషేధించింది.

పండగలు కూడా పర్యావరణ కాలుష్యాన్ని తెచ్చిపెట్టడం గమనించ వలసిన మరో అంశం. గతంలో దీపావళి నాటి రాత్రి దేశరాజధాని ఢిల్లీలో బాణాసంచా అధికంగా కాల్చడం వల్ల గాలి ప్రమాణాలు అత్యధికంగా పడిపోయాయి. ప్రభుత్వం నిర్వహించే ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చి సంస్థ ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్న పరిమితి కంటే 11 రెట్లు ఎక్కువగా పిఎమ్ లెవల్స్ (పర్టిక్యులేట్ మాటర్ స్థాయి) ఉన్నాయని తెలిపింది. నగరం మొత్తం రోడ్లు, బిల్డింగులు ఏవీ చూపు ఆననంతగా పొగమయం అయిపోయింది. ఆ మర్నాడు ఉదయమూ అదేపరిస్థితి. ఆ నేపథ్యంలో ఇండియాగేట్‌ను వీక్షించినపుడు దానిపై ఎంతటి ప్రభావం ఉండిఉంటుందో అవగాహనకు వచ్చింది.

ఏన్షియెంట్ మాన్యుమెంట్ అండ్ ఆర్కిలాజికల్ సైట్స్ అండ్ రిమైన్స్ యాక్ట్ 1958 ప్రకారం ఎన్నో హెరిటేజ్ సైట్లను కాలుష్యం కాటునుంచి కాపాడవలసి ఉంది. పై చట్టం కొన్ని గైడ్‌లైన్లను కూడా అందించింది.

సామాజిక కార్యకర్త, రచయిత అయిన సొహైల్ హష్మి .. 'చారిత్రక కట్టడాలపై కాలుష్య ప్రభావం ఉందని తెలియగానే ప్రప్రథమంగా, ప్రాథమికంగా చేయవలసింది ఆ నిర్మాణ గోడలను తడి రుమాలుతో తుడవటం. దాంతో నల్లటి మసిలాంటిది తొలగిపోతుంది. కానీ అదికేవలం ధూళి కాదు. అందులో వాహనాలకు చెందిన మండని ఇంధనం, పరిశ్రమలనుంచి వచ్చే సల్ఫర్ ఫ్యూమ్స్ కూడా ఉంటాయి. ఇవి కట్టడాల పగుళ్లలో చేరి కాలక్రమంలో ఎక్కువవుతాయి. అలాగే యాసిడ్ వానల వల్ల కూడా కట్టడాలు నాశనమవుతాయి. ఎర్రకోటలోని తెల్లని సున్నపురాయి తలుపులను 2010లో కామన్‌వెల్త్ గేమ్స్ సందర్భంగా పునరుద్ధరించారు. కానీ ఆరేళ్లకల్లా అవి పసుపురంగుకు మారిపోయాయి. కాలుష్య ప్రభావం అలా ఉంటుంది' అంటారుహష్మి. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్‌టిఎసిహెచ్) గతంలో ఈ విషయమై ప్రస్తావిస్తూ కాలుష్యం వల్ల కలిగిన నష్టాన్ని భర్తీ చేయలేం. కానీ ముందుముందు జరిగే నష్టాన్ని మాత్రం అరికట్టగలం'.

ఏమైనా ప్రజాచైతన్యంతోను, ప్రభుత్వ కృషితోను, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి స్వయం ప్రతిపత్తి సంస్థ కృషితోను వెలలేని మన చారిత్రక కట్టడాలను కలకాలం కాపాడు కోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా పర్యావరణ హితచర్యలనే చేపడుతూ, కాలుష్య నివారణకు అన్నివిధాల పాటుపడుతూ, పౌరు లందరూ అది తమ బాధ్యతగా భావించినప్పుడే తాజ్‌మహల్ వంటి అపురూప, ప్రతిష్ఠాత్మక కట్టడాలు తరతరాలకు వన్నెతగ్గకుండా గర్వకారణంగా నిలిచి ఉంటాయి. ఆ దిశగా ప్రతివ్యక్తి నిబద్ధతతో కృషిచేయాలి.

భారత పౌరులుగా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. మన సంస్కృతికి, ప్రాచీన వైభవానికి ప్రతీకలైన చారిత్రక కట్టడాలను కాపాడుకుని అంతర్జాతీయ స్థాయిలో మన ఘనతను చాటుకొందాం.

ఆసాంతం సాహిత్యసేవకే అంకితమైన పోతుకూచి!

సాహితీవనం

సాదా సీదా వేషధారణ, టోపీ ప్రత్యేక ఆకర్షణ. నిరాడంబరుడు. చెప్పాలంటే సర్వసంగ పరిత్యాగి డా.పోతుకూచి సాంబశివరావుగారు. ఆంధ్రా యూనివర్సిటీ వారు 'కళాప్రపూర్ణ'ని'గా చేస్తే, కృష్ణ తత్వాన్ని వంటబట్టించుకుని, కృష్ణుడే సర్వస్వమని, తాను పిలిచినప్పుడు పనికి సహాయం చేస్తాడని నమ్మి, ఆ కృష్ణుడు బోధించినరీతిలో జీవితాన్ని కర్మయోగిగా సాగించి, ఆనందంగా ఆ కృష్ణ సాన్నిధ్యాన్ని పొందారు. 'కృష్ణానంద' శ్రీ పోతుకూచివారు.

న్యాయవాద విద్య నభ్యసించినా, ఎన్నో ప్రభుత్వ శాఖలలో ఉద్యోగ నిర్వహణ గావించినా, ఆయనను సాహిత్యరంగం ఆకర్షించినంతగా మరే రంగం ఆకర్షించలేదనిపిస్తుంది. కాకినాడ పి.ఆర్.కళాశాలలో ప్రారంభమై 65 సంవత్సరాలు నిర్విరామంగా సాగి హైదరాబాద్ కవాడిగూడలో 'కృష్ణ దర్బార్'లో ముగిసింది వారి సాహితీ ప్రస్థానం.

అపర పుంభావ సరస్వతియైన పోతుకూచి సవ్యసాచిలా అనేక రంగాల్లో నిష్ణాతులు. కథకుడిగా, కవిగా, నవలా రచయితగా, నాటక రచయితగా, నటుడిగా, పాత్రికేయుడిగా ప్రఖ్యాతి గడించారు. మూడు వందలకు పైగా కథలు, అరడజను పైగా నవలలు, బయోగ్రఫీలు, వ్యాసాలు, ఆధ్యాత్మిక రచనలూ చేశారు. అంతేకాక 'కలసివుంటే కలదు సుఖం', తండ్రులు కొడుకులు' సినీ నవలలూ ఉన్నాయి వారి రచనలలో.

'ఆత్మ కథా తరంగాలు' ఆవిష్కరణ సభలో..

జ్యోతిష శాస్త్రం, ప్రకృతి వైద్యాలలో వారు దిట్ట. వారి నవల 'ఉదయ కిరణాలు' రష్యన్ భాషలోకి అనువాదమయింది. 'అన్వేషణ' నవలకు 1960లో ఆంధ్రప్రదేశ్ భాషా సమితి అవార్డ్ లభించింది. వారి 'హంతకులు' నాటకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డ్ లభించింది.

పోతుకూచివారు బహుభాషా ప్రావీణ్యుడు. ఇండియన్ రైటర్స్ యూనియన్' కేరళ- ఉపాధ్యక్షులుగా, కేంద్ర సాహిత్య అకాడెమీకి 18 సంవత్సరాలు పనిచేశారు. అనేకానేక పదవులు నిర్వహించారు. సాహిత్య సేవకు 'విశ్వసాహితి', సంస్థ స్థాపన నాంది అయితే, విశ్వ వ్యాపితమైన 'విశ్వరచన', ఆంగ్ల పత్రిక 'విశ్వ'లు పరాకాష్ట. కవితా రీతుల్లో 'చుక్కలు' కవితకు రూపశిల్పి.

ప్రభుత్వ సహకారంతో ఆంధ్రరాష్ట్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన తొలి సాహిత్యాభిలాషి. ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల సభలు 4సార్లు నిర్వహించటంలోనే తెలుస్తుంది, మహిళా రచయిత్రులకు వారందించిన ప్రోత్సాహం. అఖిల భారత స్థాయిలో కవుల సభలను అనేకసార్లు నిర్వహించిన ఘనత వారికే సొంతం.

'విశ్వసాహితి'తో పాటు అనేక సంస్థలకు సలహాదారుగా సహాయ సహకారాలందించారు. 'అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్' భోపాల్ సంస్థకు ఉపాధ్యక్షులుగా, దక్షిణ భారత కో ఆర్డినేటర్ (సమన్వయకర్త)గా ఎంతోమంది రచయితలు, రచయిత్రులు, కవులు, కవయిత్రులను, ప్రోత్సహించి, వారు జాతీయ పురస్కారాలు అందుకుంటే ఎంతో ఆనందించారు.

నేడు సాహిత్యంలో పేరు ప్రఖ్యాతులు గడించిన వారెవరిని కదిలించినా డా.పోతుకూచివారి సాహితీవనంలో విరబూసిన విరులమని చెప్పటం వింటే, ఆ సాహితీ వనమాలికి వేరే పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి పురస్కారాలేవీ అవసరంలేదు. సాహితీలోక సృష్టి మొత్తం వారి ప్రోత్సాహంతో జరిగిందని తెలిసాక తొలితరం కవులు, రచయితల నుండి నేటి వర్ధమాన రచయితలు, కవుల వరకు ఎప్పటికీ రచయిత, కవి మనసులో నిలిచియుండే సదాస్మరణీయులు డా.పోతుకూచి. ఆఖరి రోజువరకు నెలకు తప్పక రెండు 'విశ్వ సాహితి' సభలు, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సభ నిర్వహించారు. ఆయన ఆఖరుగా నిర్వహించిన సభ 3-8-17న జరిగింది. ఆ సభలో వారి 'ఆత్మ కథా తరంగాలు' మొదటిభాగం ఆవిష్కరణ జరిగింది. ఎంత ప్రోత్సహిస్తున్నా సాహిత్యానికి తగ్గిపోతున్న విలువలు, ఆదరణ గురించి ఆవేదన వ్యక్తపరిచారు. యువ సాహితీకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వారి ఆశ సఫలం కావాలని ఆశిస్తూ సమర్పిస్తున్న అక్షర నివాళి ఇది.

–గోళ్లమూడి పద్మావతి

కృతి

చదివించే కవిత్వ సంభాషణ..



రెండు పక్షులు వాటిమధ్య ఏ సంభాషణా లేకున్నా సమన్వయంతో జీవనం సాగిస్తాయి. ఒకే జీవితం, ఒకే గమనం, ఒకే గమ్యంలా బతుకుపోరాటాన్ని జీవితాంతం కొనసాగిస్తాయి. మరి ఆలోచన, విజ్ఞత, సంభాషణ యివన్నీ మనుషులు, ముఖ్యంగా ప్రేయసీప్రియుల లేదా దంపతుల మధ్య వున్నా జీవితాన్ని ఎందుకు ఆనంద మయం చేసుకోలేకపోతున్నారు? అపోహలు, అసూయలు, అహంకారా లు, అవమానాలు, ఆధిపత్యాల జాడ్యంతో అర్థమంతమైన ఆత్మీయ జీవ నానికి దూరమవుతున్నారని అంటారు, బూర్ల వెంకటేశ్వర్లు తమ కవిత్వ సంభాషణలో. దీవి సుబ్బారావు తెలుగులోకి అనువాదంచేసిన గాధా సప్త శతి ప్రేరణగా, ధ్వనిప్రధానంగా అతడు-ఆమె మధ్య జరిగినసంభాషణను కవిత్వపరంగా వినిపిస్తారు. దంపతుల మధ్య లోపిస్తున్న అవగాహనను సరిచేయడానికి సున్నిత, సరస సంభాషణలే ఔషధమని కవి అభిప్రా యం. 'ఏడుపులో కూడా ఎర్రబడ్డ చందమామలా అందంగా వున్నావు' అని అతడంటే, 'కోపంలో నువ్వు ఎర్రకోతిలా అందంగానే వున్నావు' అని ఆమె అంటుంది. ఆమె కోపంతో వూగిపోయినప్పుడల్లా అతడు పక్క సర్దుతుంటాడు. 'తాపంతో ఎండమండిన తర్వాత భోరున వాన కురవడం.. ఎన్ని చూడలేదూ' అన్నది అతడి విశ్వాసం. వచన కవిత్వంలో యిదో ప్రయోగం. ఆస్వాదిద్దాం రండి.

(రెండు పక్షులూ..ఒక జీవితం: బూర్ల వేంకటేశ్వర్లు-కవిత్వ సంభాషణ; వెల: రూ.100; ప్రతులకు: బి.సంతోష, ఇంటి నెం.2-10-1524/10, ఫ్లాట్ నెం.403, వేంకటేశ్వర టవర్స్, జ్యోతి నగర్, కరీంనగర్, తెలంగాణ-505001)

-రమణ వెలమకన్ని

భిన్న కోణాల్లో భేషైన కథలు..



ఎందరో సీనియర్ రచయిత్రులు తాజాగా రాసిన కథలను 'రచయిత్రుల కొత్తకథలు' పేరిట ఒక సంపుటిగా వెలువరించారు వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారు. సంకలనకర్త తెన్నేటి సుధాదేవి. ఇందులోని కొన్ని కథలను ఇక్కడ ప్రస్తావించుకుందాం. మన వివాహ వ్యవస్థ తీరును ప్రతిబింబిస్తూ ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'పెండ్లి అంటే ఇది!' కథ ఎంతో వాస్తవికంగా ఉంది. ఇందిర పాత్రద్వారా గొప్ప సందేశాన్నందించారు. జలంధర రచించిన 'ఉత్తరం' కథ ఎంతో బాగుంది. ఆస్తిపంపకాలు అనుబంధాలను ఎలా దెబ్బతీస్తా యో చక్కగా చిత్రీకరించారు. 'ఎంత విలువైనవి, ఎంత అల్పమయిన వాటికోసం పోగొట్టుకుంటారో మనుష్యులు' అన్న మాటలు వెలలేనివి. 'స్వాభిమానం' కథలో మనిషితనానికి మచ్చుతునకగా రామన్ పాత్రను శారదా అశోకవర్ధన్ చక్కగా చెక్కారు. డా.ముక్తేవి భారతి 'గోడలు కది లాయి' కథ స్ఫూర్తిదాయకంగా ఉంది. 'మనిషి జాడలు' మరో మంచి కథ. బలభద్రపాత్రుని రమణి రచన 'పాత సామాన్లు' ప్రతివారికీ అన్వ యించేదే. జ్ఞాపకాల పరిమళం సేదతీరుస్తుందన్నది ఎంతైనానిజం. గంటి భానుమతి 'మానవత్వపు స్పర్శ' కథ చదివితే ఆసుపత్రుల్లో సిస్టర్లందరూ మారియాలయితే ఎంత బాగుండు' అనిపిస్తుంది. పొత్తూరి విజయలక్ష్మి 'శ్రద్ధగా పనినేర్చుకో నాన్నా' కథలో నవ్వుల్లో ముంచెత్తుతూనే అబ్బాయి లకూ పనిపాటలు రావాల్సిందేనని చెప్పినతీరు అమోఘం. సంకలనం లోని ప్రతి కథా వైవిధ్యభరితం, పఠనీయం.

(రచయిత్రుల కొత్తకథలు; వెల:రూ.200; ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్)

-జె.శ్యామల

ఇవీ అందాయి..

'పద'నిసలు- తెలుగు క్రాస్‌వర్డ్ పజిళ్ళు
సత్యసాయి కొవ్వలి; వెల:రూ.150
ప్రతులకు: సత్యసాయి కొవ్వలి,
ఎ-202-నెస్టిల్2, లోయర్ పారెల్,
దీపక్ సినిమా దగ్గర, ముంబై-400013

శంకర ప్రభ: వంగర ఓంకారేశ్వర వర ప్రసాదు
వెల:రూ.60; ప్రతులకు:ఓంకారం, శ్రీకామేశ్వరీ
సదనము, డోర్ నెం26-40-13 సి,
నిర్మల కాన్వెంట్ దగ్గర, 4వలైను,
ఏ.టి.అగ్రహారం, గుంటూరు-522004



సత్యవాణి -జ్ఞానయుక్తమైన 117 కథలు
డాక్టర్ పి.బి.మనోహర్; వెల:రూ.100;
ప్రతులకు:బ్లెస్సింగ్ బుక్స్, డో.నెం.21-9/6, 7వ
లైను, పసుపుతోట, మధురానగర్,
విజయవాడ-520011

పునీతులు (నవల)
అనురాధ (సుజలగంటి)
వెల:రూ.50
ప్రతులకు: అన్ని ప్రధాన పుస్తక విక్రయకేంద్రాలు



స్ఫూర్తిదాయక పుస్తకం

భారత రాజ్యాంగ శిల్పి డా.బి.ఆర్.అంబేద్కర్ చరిత్రలో నిలిచిపోయే స్ఫూర్తి మూర్తి. మహా విద్యా వేత్త. ప్రపంచం మొత్తం గర్వించదగ్గ మేధావి. గొప్ప దేశభక్తుడు, తాత్వికుడు. మహర్ అనే నిమ్నజాతిలో జన్మించి, నాటి సమాజంలో అనేకానేక అవమానా లకు, వివక్షకుగురయ్యాడు. ఆ వేదనతోనే భారతీయ సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించడానికి ఎనలేని కృషి చేశా డు. అస్పృశ్యతతో అణగారిపోయిన జాతులకు అంబేద్కర్ దేవుడు. అటువంటి డా.బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రను ఆసక్తికరంగా ఎంతో వివరంగా రచించారు షేక్ అబ్దుల్ హకీం జాని. అంబేద్కర్ పుట్టుక దగ్గర్నుంచి ఆయన జీవితంలోని అనేక మలుపులను అధ్యా యాలవారీగా అందించారు. ఈ పుస్తకం చదివితే కేవలం అంబేద్కర్ గురించి మాత్రమేగాక, ఆనాటి భారతీయసమాజం తీరును, ఇతర దేశాలలో పరిస్థితులను కూడా అవగతం చేసుకోవచ్చు. ముఖ్యంగా అంబేద్కర్ చేసిన విస్తృతకృషి స్వరూప స్వభావాలను ఎంతో చక్కగా మనముందుంచారు. ఆయన నడిపిన పత్రికలు, రచనల గురించి, కుల వ్యవస్థపై ఆయన సమరం గురించి ఎన్నెన్నో విషయాలు పాఠ కులు ఈ పుస్తకంద్వారా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా అందరికీ సమ్మ తమైన మతానికి ఆయన చేసిన సూచనలు ఆలోచించదగ్గవి. ఎంతో స్ఫూర్తినిచ్చే ఈ పుస్తకం ప్రతి వ్యక్తి పఠించదగ్గది.

(డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవితచరిత్ర:షేక్ అబ్దుల్ హకీం జాని; వెల: రూ.140, ప్రతులకు:లక్ష్మీ శ్రీనివాస పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం.56, ఆర్. టి.సి.కాలనీ, హయత్‌నగర్, హైదరాబాద్-501505)

-ప్రభాస

మాతృఘోష జలపాతమై..

కస్తూరి మురళీకృష్ణ

ఆ అత్యద్భుతమైన ప్రకృతి దృశ్యం చూస్తూ స్థాణువులా నిలిచి పోయారు వారిద్దరూ. దాదాపుగా 1115 అడుగుల ఎత్తునుండి దూకుతున్న ఆ నీటిధార చూస్తుంటే అనంత ప్రకృతి విరాట్ స్వరూపం మనస్సు గ్రహిస్తోంది. ఎదురుగా, మేఘాలను తాకుతున్న కొండలు, వాటిపై గర్వంగా మొలచి కప్పుతున్న పచ్చటి చెట్లు, వాటి నడుమనుండి దూకుతున్న తెల్లటి పాలవంటి నీటిధార! 'చిరపుంజి గురించి పుస్తకాలలో చదివాను. ప్రపంచంలో అత్యధికమైన వర్ష పాతం కల ప్రాంతాలలో ఒకటి అని తెలుసు. కానీ ఈ 'జలపాతం' గురించి ఎప్పుడూ వినలేదు' ఆశ్చర్యంగా అడిగాడు వినోద్.

నవ్వాడు బిరించి. 'మా ఈశాన్య రాష్ట్రాల గురించి దేశంలోని ఇతర ప్రాంతాల వారికి అంతగా తెలియదు. ఈ జలపాత ధార అంతా వర్షపు నీటి వల్ల ఏర్పడింది. పైనున్న సమతల ప్రదేశంలో చేరిన నీరు ఈవైపు ప్రవహించి ఇంత ఎత్తునుంచి దూకుతోంది'.

చాలా సేపు నిశ్శబ్దంగా ఆ దృశ్యాన్ని చూస్తూండిపోయాడు వినోద్. చివరికి మౌనాన్ని భంగంచేస్తూ అన్నాడు. 'ఈ జలపాత ధారలో ఏదో రోదన వినిపిస్తోం ది. ఎవరిదో హృదయ ఆక్రందన ధ్వనిస్తోంది. ఇది మామూలు జలపాత హోరులా లేదు'.

వినోద్ వైపు ప్రశంసిస్తున్నట్టు చూశాడు బిరించి. 'నిజమే..ఇది మామూలు జలపాత ధార హోరు కాదు. ఈ జలపాతం పేరు 'నోహ్ కా లికాయ్ జలపాతం'. ఖాసిభాషలో 'కా లికాయ్ దూకు'అని అర్థం.

'అంటే?'

'ఖాసి భాషలో మహిళల పేరు ముందు 'కా' అనే శబ్దం ఉంటుం ది. అమ్మాయి పేరు లికాయ్. ఆమె ఇంత ఎత్తునుంచి కిందకు దూ కింది. దూకుతూ ఆమె జలపాతంలా మారిపోయింది. ఈ జలపాతం హోరు ఆమె హృదయ ఆక్రందనను రోదనను ధ్వనిస్తుంది'.

'ఆమె ఎందుకని దూకింది? విఫల ప్రేమనా?'

'కాదు..అత్యద్భుతమైన ప్రేమ. ప్రేమ అంటే కేవలం యువతీ యువకుల ప్రేమ కాదు. ప్రేమది అనంత స్వరూపం. ప్రేమ సూర్యుడయితే, ప్రేమలోని పలు రకాలు సూర్యుడి కిరణాల వంటివి. అలాంటి ఓ కిరణం ఈమె ప్రేమకథ'.

'ఏమిటది చెప్తావా?' అడిగాడు వినోద్.

చెప్పటం ఆరంభించాడు బిరించి.

****

తాను తీసుకున్న నిర్ణయం మంచి చెడుల గురించి ఆలోచిస్తూ కూర్చుంది లికాయ్. ఆమెకు ఎటూ తేలటంలేదు.

'రంగజ్యార్తె' గ్రామంలోని అనేకమంది మహిళలలాగ 'లికాయ్' కూలినాలి చేసుకుని బతుకుతూంది. ఆమెకు వివాహమయింది. వివాహమయినా ఆమె ఆర్థిక పరిస్థితిలో పెద్దగా మార్పురాలేదు. మార్పు వస్తుందని కూడా ఆమె ఆశించలేదు. ఎందుకంటే, ఆ గ్రామంలో అధికంగా పనిచేసేది మహిళలే. పురుషులు అప్పుడప్పుడు పొరుగూర్లకు వెళ్లి ఏదో పనిచేస్తారు. కాస్త డబ్బు సంపాదించుకు వస్తారు. అది అయ్యేదాకా ఇల్లు కదలరు. అంటే పేరుకి వివాహం తరువాత ఇంటి బాధ్యత మగవారిది. కానీ ఇంటి బాధ్యత నిజానికి తలకు ఎత్తుకునేది మహిళనే. లికాయ్ పరిస్థితి ఇందుకు భిన్నంకాదు. కానీ వివాహం వల్ల భద్రత వస్తుంది. గౌరవం లభిస్తుంది.

అయితే వివాహం అయిన సంవత్సరం లోగా ఆమె భర్త మరణిం చాడు. అప్పటికి ఆమె గర్భవతి. కొన్నాళ్లకి ఆమె ఒక ఆడశిశువును ప్రసవించింది. అయితే, ఒంటరి మహిళ, చిన్న పిల్లతో ఎంతకాలం జీవించగలదు? పైగా లికాయ్‌కి ఆస్తులు లేవు. ఆదాయం లేదు.

'మళ్లీ పెళ్లి చేసుకో' గ్రామవాసులందరూ చెవినిల్లు కట్టుకుని పోర సాగారు. వాళ్ల సాంప్రదాయంలో భర్తపోయిన మహిళ మళ్లీ వివాహం చేసుకోవటం తప్పుకాదు. 'మళ్లీ పెళ్లిచేసుకో. నీకోసం కాకపోయినా నీ పిల్లకోసం చేసుకో. నువ్వు సరిగ్గాసంపాదించలేకున్నా వాడి సంపాదన ఉంటుంది. పిల్లను సక్రమంగా పెంచవచ్చు'. పెద్దలు నచ్చచెప్పారు.

దాంతో మళ్లీ పెళ్లికి ఒప్పుకోకతప్పలేదు. లికాయ్‌కి.

సంబంధాన్ని కూడా ఊళ్లో పెద్దలే తీసుకువచ్చారు. కానీ తన నిర్ణయం సరైనదో, కాదో అన్న అనుమానం లికాయ్‌ని వదల్లేదు. ఆమె ఆలోచనలు తేలకముందే అతడు గదిలోకి వచ్చాడు. ఆమె అతడివైపు చూసింది.

ఆమె పక్కన కూర్చుంటూ అన్నా డతడు. 'నీ కూతురిని బంధువుల ఇంట్లో వదిలేయవచ్చుకదా?'

నిర్ఘాంతపోయి చూసింది ఆమె అతడి వైపు. 'నేను పెళ్లికి ఒప్పుకున్నదే అమ్మాయికి భద్రత ఉంటుందని' అన్న మాట నోటిదాకా వచ్చింది. కానీ పైకి అనలేదు. మౌనంగా ఉండిపోయింది. కాస్సేపటికి అతడే అన్నాడు. 'అమ్మాయి అచ్చు నీ మొదటి భర్తలా ఉంటుంది. దాన్ని చూసినప్పుడల్లా వాడు గుర్తుకు వస్తాడు. వాడితో నువ్వు గడిపిన ఘడియలు ఊహలోకి వస్తాయి. అది నేను భరించలేను. అది నాకు కనబడకుండా చెయ్యి'.

'పసిపిల్లను పసిపిల్లలా చూడలేరా?'

'అది పసిపిల్ల కాదు. వాడికి ప్రతిరూపం'. విసురుగా వెళ్లిపో యాడు. నిశ్శబ్దంగా కన్నీళ్లుకార్చింది లికాయ్. తాను తప్పు చేసిందని అర్థమయింది ఆమెకు. అప్పటినుంచీ లికాయ్‌కే కాదు ఆమె కూతురికి కూడా కష్టకాలం మొదలయింది.

****

లికాయ్‌కి ఈ ప్రపంచంలో కూతురు తప్ప మరే విషయంపై ఆసక్తిలేదు. మామూలు కన్నా పెద్ద కళ్లతో ప్రపంచాన్ని వింతగా చూసే తన పాప అంటే లికాయ్‌కి అమితమైన ప్రేమ. తన రెండవ భర్తకి ఆ అమాయకమైన పాపలో మొదటి భర్త ఎలా కనబడుతున్నా డో లికాయ్‌కి అర్థంకావటంలేదు.ఎందుకంటే, లికాయ్‌కి ఆ పాపలో ఓ నూతన ప్రపంచం కనిపిస్తోంది. ఒక నూత్న విశ్వం పాపలో ప్రాణం పోసుకుని ఎదుగుతున్నట్టు అనిపిస్తుంది. ఆ కళ్లల్లో ఈ ప్రపంచం లోని రహస్యాలను అన్వేషించి సాధించే విజ్ఞాన తృష్ణ కనిపిస్తుంది. పాపను చూస్తుంటే భగవంతుడి కళానైపుణ్యం బోధపడుతున్నట్టు అనిపిస్తుంది. ఎంత శ్రమపడి, ఎంత ఆప్యాయంగా భగవంతుడి పాపను మలచాడో అన్న భావన కనిపిస్తుంది. ఎదిగిన ఈ పాప విజ్ఞానవంతురాలై, ఈ ప్రపంచపురోగతిలో తన వంతు బాధ్యత నిర్వహిస్తుందనీ ప్రపంచం కొనసాగటానికి తనవంతు తోడ్పడుతుం

దన్న భావన కలిగినప్పుడల్లా ఎంతో గర్వంగా అనిపిస్తుంది. తను ఈ నూత్న ప్రత్యేకమైన విశ్వానికి జన్మనిచ్చిందన్న భావన ఆమెకి తానే సృష్టికర్త అయిన భావనను కలిగిస్తుంది. కానీ భర్తకు పాపను చూస్తే చిరాకు వస్తుంది. ఏదో చిన్న కారణం ఆధారం చేసుకుని పాపను దండిస్తాడు. తిడతాడు. అరుస్తాడు. బెదిరిస్తాడు. అంత అమాయకము, మృదువైన, భగవంతుడి అత్యద్భుతమైన కళాసృష్టితో అంత రాక్షసంగా, అంతనీచంగా కర్కోటకుడిలా ఆయన ఎలా వ్యవహరించ గలుగుతున్నాడో లికాయ్‌కి అర్థంకావటంలేదు.

పాప కూడా తండ్రిని చూస్తే బెదురుతోంది. అతడికి దూరం దూరంగా తిరుగుతోంది. దీన్ని మించి కూడా లికాయ్‌ని మరో విషయం అధికంగా బాధిస్తోంది. తాను డబ్బు సంపాదిస్తే పాప అనుభవిస్తుందని అతడు పనిచేయటం మానేశాడు. ప్రొద్దస్తమానం ఇంట్లో ఉండి పాపను పీడించటం, తనని వేధించటం చేస్తాడు.

దాంతో లికాయ్‌పై ఒత్తిడి పెరిగింది. ఇంటిని నడిపే బాధ్యత సంపూర్ణంగా లికాయ్‌పై పడింది. ఆమె బయటకు వెళ్లినప్పుడు కనీసం పాపను అతడు చూసుకుంటే ఆమెకి అంత ఒత్తిడి కలిగేది కాదు. కానీ అతడికి పాప పొడనే గిట్టదు. దాంతో పాపను అతడికి దూరంగా ఉంచాలన్న ప్రయత్నాలు కూడా ఆమెని బాధించేవి. అయితే, ఊళ్లో ఆడవాళ్లందరూ పనికిపోవటంతో ఆమె తప్పనిసరిగా పాపను ఇంట్లో అతడి దగ్గర వదలాల్సి వచ్చింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత పాప ఒంటిపై తేలిన వాతలకు మందులు రాయాల్సి వచ్చేది.

అప్పుడు ఆమె కంటినుంచి రాలిన కన్నీళ్లు కాల్వలై ప్రవహించేవి. ఆమె హృదయంలోని వేదన దట్టమైన నల్లటి మబ్బులై ఆకాశాన్ని కప్పేసేది. ఏడుపులో ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసలు తుఫాను నాటి ప్రళయ ఝుంఝూమారుతంలా అనిపించేది.

అలాంటప్పుడు ఆమెని పలు రకాలైన ఆలోచనలు చుట్టుముట్టేవి.

ఏమిటీ జీవితం? ఎందుకీ జీవితం? ఒక అమాయకమైన ప్రాణిని ఈ ప్రపంచంలోకి తెచ్చింది ఇలా హింసించటానికా?

అసలు మనుషులు ఎందుకంత క్రూరంగా ఉంటారు? ఒక పసిపాపను ద్వేషించేంత మూర్ఖత్వం, రాక్షసత్వం మనుషులలో ఎందుకు కలుగుతుంది?

ఇలా ఆలోచిస్తూ పాపను దగ్గరకు హత్తుకుని లాలనగా ఊపుతూన్నప్పుడు ఆమెకు ఆకాశం తన బాహువుల్లో ఉన్నట్టనిపించేది. సకల విశ్వం పాపరూపంలో తన కౌగిలిలో ఒదిగిన భావన కలిగేది.

ఎంతో సాంత్వనగా అనిపించేది. ఓవైపు బాధ, మరోవైపు ఆనందంలాంటి పరస్పర విరుద్ధమైన భావనలు ఆమెను చుట్టుముట్టేవి. అమాయకమైన కళ్లతో తనవైపు చూస్తూ, తన కౌగిలిలో రక్షణ పొందిన భావనను ప్రదర్శిస్తూ నిశ్చింతగా నిద్రపోతున్న పాపను చూస్తే ఆమె మనస్సులో ప్రేమ భావన కట్టలు తెంచుకుని పరవళ్లు తొక్కేది. 'ఎలా రక్షించాలీ పాపను? ఎలా కాపాడాలీ నూతన విశ్వాన్ని?' అనే ఆలోచనలతో సతమతమయ్యేది.

****

'నేను పొరుగూరు వెళ్లాలి. తెల్లారికల్లా వచ్చేస్తాను. పాపను చూసుకుంటావా?' భయంభయంగా అడిగింది లికాయ్.

ఏ కళనున్నాడో 'సరే' అన్నాడు.

అదే విషయం పాపకు చెప్పింది. పాప భయంభయంగా చూసింది ఆమె వైపు. ఆమె కళ్లల్లో భయం చూసి కరగిపోయింది లికాయ్. కానీ వెళ్లక తప్పదు.

'భయంలేదు. నాన్న నిన్ను చూసుకుంటాడు' నచ్చచెప్పింది.

పాపనుంచి వీడ్కోలు తీసుకుంటూంటే పాప ఆమెవైపే చూస్తూ కూర్చుంది. పాప కళ్లల్లో భావం లికాయ్‌కి అర్థంకాలేదు. ఎందుకో హృదయం మెలిపెట్టినట్టు అనిపించింది.

వెనక్కు పరుగెత్తుకు వెళ్లి పాపను హత్తుకుని 'నీకేం భయంలేదు. నేనున్నాను' అని చెప్పాలనిపించింది. కానీ గుండెను రాయిచేసుకుని వెళ్లింది. తెల్లారేసరికల్లా ఇల్లు చేరుకుంది. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. అతడు ఏదో పనిచేసుకుంటున్నాడు.

'పాప ఏదీ?' అడిగింది.

'ఆడుకుంటున్నట్టుంది' సమాధానం ఇచ్చాడతడు.

ఆమె గబగబా స్నానం చేసింది. బాగా అలసిపోయి ఉంది. ఆకలిగా ఉంది. దాంతో అతడు వండిపెట్టినదేదో తినేసింది. వక్కపొడి వేసుకోనేందుకు డబ్బా తీసుకుని స్థాణువైపోయింది. వక్కపొడి డబ్బా పక్కన ఒక పసిపాప వేలు పడి ఉంది. అది ఎవరిదో చెప్పనక్కర్లేదు.

ఆమె శరీరమంతా ఒక వణుకు విషసర్పంలా ప్రవహించింది. ఆమె శరీరం జలదరించింది. తల తిరుగుతున్నట్టనిపించింది. వేలు పట్టుకుని అతడి దగ్గరకు పరుగెత్తుకు వెళ్లింది.

'పాప ఏదీ?' ఆమెకు మాట సరిగ్గా రావటంలేదు. శరీరం లోపల ఏదో తుఫాను.

శరీరాన్ని ఛేదించి బయటకు రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

'చంపేశాను. పీడాపోయింది'. నిర్దాక్షిణ్యంగా చెప్పాడతడు.

ఆమె కళ్లముందు తాను వెళ్తూంటే పాప చూసిన చూపు మెదిలింది.

తాను పాపను బలిపశువులా కసాయివాడికి అప్పగించింది!

ఆమె మరి ఆలోచించలేదు. పక్కనే ఉన్న గొడ్డలి తీసి ఒక్కవేటున అతడి తలను రెండుముక్కలు చేసింది.

పిచ్చిపట్టిన దానిలా 'పాపా' అని అరుస్తూ పరుగెత్తింది.

ఆమె శరీరంలో ఏదో భయంకరమైన అగ్ని రగులుతోంది. మనస్సులో అగ్ని జ్వాలలు ఎగసెగసి పడి దహించివేస్తున్నాయి.

ఆమె నిలవలేకపోతోంది. ఆమెలోని శక్తి అంతా అగ్ని అయి ఆమెను దహించివేస్తోంది. ఆ వేడి భరించలేక పరుగిడుతోంది ఆమె 'పాపా' అని అరుస్తూ. ఆమె ఎటుచూసినా తనవైపు బేలగా చూస్తున్న పాప కళ్లే కనిపిస్తున్నాయి.

'అమ్మా నన్ను రక్షించవా?' అని అడుగుతున్నట్టే ఉంది.

'అమ్మా..అమ్మా..'అని మరణభయంతో కేకలు పెడుతున్నట్టే ఉంది.

'ఆ పసి మనసులోఎలాంటి భావనలు కలిగి ఉంటాయి? ఎలా బాధపడి ఉంటుంది!

లికాయ్ శరీరం నిప్పులో మరగిపోతోంది. ఆమె సర్వం దహించుకుపోతోంది.

ఎటుచూసినా పాప.

వీచే గాలిలో పాప ఆక్రందన వినిపిస్తోంది.

కనిపించే ప్రకృతి పాప కళ్లయి తనవైపే చూస్తున్నాయి. జాలిగా, బాధగా!

అణువణువూ పాప ఆకృతి అయి ఆమె వైపే చూస్తున్నది.

ప్రతి శబ్దం పాప ఆక్రందనగా ధ్వనిస్తోంది.

'పాపా' అని అరుస్తూ, ఏడుస్తూన్న లికాయ్ కొండ అంచునుండి జారిపోయింది.

ఆమె మనస్సు 'పాపా' అని అరుస్తోంది. రోదిస్తోంది. ఆమె ఆక్రందన ఆ లోయ అంతా నిండింది.

అయితే..ఆమె శరీరం నేలను తాకలేదు. నేలను చేరేలోగా ఆమె కరగి నీరైపోయింది. ఆమె దుఃఖంతో స్పందించినట్టు ఆకాశం వర్షించటం ఆరంభించింది.

...ఆమె జలపాతధారగా మారిపోయింది.

జలపాత ధార హోరు ఆమె ఆక్రందనగా ధ్వనించసాగింది.

****

'పాపా..పాపా..' అంటున్న జలపాత ధార హోరు వింటున్న వినోద్ కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

'ఇది అత్యద్భుతమైన ప్రేమగాథ' అన్నాడు గద్గదిక స్వరంతో.

'లికాయ్ దూకింది కాబట్టి ఈ జలపాత ధారను 'నోక్ కా లికాయ్' అంటారు' చెప్పాడు బిరించి.

'ఇది ఖాసీలు నిరంతరం స్మరించుకునే ప్రేమగాథ. లికాయ్ జలపాతంగా మారినప్పటినుంచీ ఈ ప్రాంతంలో శిశుహత్యలు ఆగిపోయాయి' కథను పూర్తిచేశాడు బిరించి.

రంగులు వేయండి



పిల్లలూ! ఈకింది సూచన ప్రకారం
ఆయా అంకెల వద్ద, ఆయా రంగులు వేయండి.
1.Grey 2.Brown 3.Green
4.Yellow 5.Blue 6.Purple

పదాల ఆట

S	I	G	M	O	I	D	Q	K	K	F	N	C	Z	J
D	E	R	U	T	A	N	E	D	X	C	N	T	A	J
O	X	I	D	O	R	E	D	U	C	T	A	S	E	S
L	Y	S	A	S	E	S	Q	H	L	D	U	T	T	P
N	O	V	K	D	D	X	V	K	Y	G	K	Z	A	E
C	Z	L	C	I	L	A	Y	Q	O	Z	B	J	R	C
A	S	E	S	A	R	E	M	O	S	I	E	A	T	I
T	F	E	X	L	O	S	E	S	A	G	I	L	S	F
A	S	E	S	A	R	E	F	S	N	A	R	T	B	I
L	C	O	F	A	C	T	O	R	K	X	R	K	U	C
Y	N	U	P	R	O	D	U	C	T	S	S	K	S	V
S	B	A	L	L	O	S	T	E	R	I	C	D	P	E
T	I	Z	A	P	O	E	N	Z	Y	M	E	T	I	D
Q	T	G	I	X	H	Y	D	R	O	L	A	S	E	S
H	C	O	M	P	L	E	M	E	N	T	A	R	Y	Z

పిల్లలూ! కింది పదాలు పైపజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

SPECIFIC, COF ACTOR, CATALYST, APOENZYME, SUBSTRATE, HYDROLASES, LIGASES, ISOMERASES, OXIDOREDUCTASES, TRANSFERASES, LYSASES, PRODUCTS, KCAT, COMPLEMENTARY, DENATURED

పశ్చాత్తాపం

కథ

పరంధామ్‌కు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు శంకర్. ఐదో తరగతి చదువుతున్నాడు. రెండోవాడు కాస్త ఆలస్యంగా పుట్టినందువల్ల మూడేళ్ల పసివాడు. అతడిపేరు సుందరం. ఇంకా బడిలో చేర్చలేదు. శంకర్ చదువులో చురుకైనవాడే. కానీ ఇతరుల వస్తువులు దొంగతనంగా తీయడం, తన తప్పును ఇతరులపై వేసేయడం చేసేవాడు. ఒకసారి స్కూలు మాస్టారు, పరంధామ్‌కు కనిపించి శంకర్ పక్క పిల్లల తాయిలాలు చూడకుండా తినేసి, అడిగితే ఇతరుల పేర్లుచెప్పి తాను తప్పించుకుంటున్నాడని, ఈమధ్య మరీ ఇలాటి అల్లరి ఎక్కువయిందని, తాను స్వయంగా అతడిని గమనించే చెపుతున్నానని చెప్పాడు. క్లాసులో పిల్లలు శంకర్ వల్ల బాధపడుతున్నారని, తానే దండించవచ్చునీ, కానీ దానివల్ల శంకర్ చదువుమీద ప్రభావం చూపుతుందని, కాబట్టి తండ్రే తగినవిధంగా దారిలో పెట్టాలని హెచ్చరించాడు.

పరంధామ్ ఎప్పుడూ తన వ్యాపార వ్యవహారాల్లో మునిగి తీరిక లేక పిల్లల్ని అంతగా గమనించలేదు. భార్య కూడా ఇంటి పనుల్లో మునిగి, పిల్లలమీది నమ్మకంతో నచ్చినవి వాడికి పెట్టడం, చదువుల్లో చురుగ్గానే ఉన్నాడని సంతోషించడటం చేసేది.

అప్పుడప్పుడూ చిరుతిళ్లు తినేసినా, వస్తువులు విరిచేసినా మాటలు కూడా సరిగా రాని తమ్ముడిపై నిందవేసి తప్పించుకునేవాడు శంకర్.

కానీ మాస్టారు శంకర్ గురించి చెప్పటంతో పరంధామ్ ఆలోచనలోపడ్డాడు. రాత్రి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

మర్నాడు ఆదివారం కావటంతో శంకర్, సుందర్ టిఫిన్ తిని ఆడుకుంటున్నారు. పరంధామ్ భార్యను పిలిచి, ఇంటికి రాబోయే అతిధులకోసం మిఠాయిలు తెచ్చానని, సీసాలో వాటిని భద్రం చేయమని శంకర్‌కు వినిపించేలా గట్టిగా చెప్పాడు. ఆమె అలాగే చేసి, అలమరలో సీసాపెట్టి, పెరట్లోకి వెళ్లిపోయింది.

సాయంత్రం ఇంటికి వచ్చి చూసిన పరంధామ్‌కు సీసాలోని మిఠాయిలు తగ్గినట్లు తెలిసింది. భార్యను, శంకర్‌ను పిలిచి మిఠాయిల విషయం అడిగాడు. శంకర్, తమ్ముడే తిన్నాడని ఠక్కున చెప్పాడు. వెంటనే పరంధామ్ సుందర్‌ని తీసుకుని బయట కెళ్లిపోయాడు. ఓ గంట తర్వాత ఒంటరిగా వచ్చిన పరంధామ్‌ని చూసి, తమ్ముడేడని అడిగాడు శంకర్. చిన్నవాడైనా, తెలియకచేసినా చేసిన తప్పుకు శిక్షవేయక తప్పదని, అందుకే ఊరుబయట

అడవిలో ఈ రాత్రి గడిపితేగానీ బుద్ధిరాదని వదిలేసి వచ్చానని చెప్పాడు పరంధామ్.

అదివిన్న శంకర్‌కు భయం, బాధ ఒకేసారి కలిగాయి. ఇంతచిన్న తప్పుకు తండ్రి అలా చేస్తాడని శంకర్ అనుకోలేదు. తమ్ముడు చిన్నవాడుకాబట్టి, తప్పును వాడిమీదికి నెట్టేస్తే తనను ఏమీ అనరని అనుకున్నాడు. కానీ ఇప్పుడు తన ఆలోచన తలకిందులైంది. తండ్రిమీద కోపం వచ్చింది. అంత చిన్న పిల్లవాడిని అడవిలో వదలటమా? ఏ క్రూరమృగమో తినేస్తే? చీకట్లో వాడెంత భయంతో ఏడుస్తున్నాడో? తలచుకుంటూ కుమిలిపోయాడు. పశ్చాత్తాపం మొదలైంది. వెంటనే భోజనం చేస్తున్న తండ్రి దగ్గరకు వెళ్లి తానే ఆ మిఠాయిలు తిన్నానని, తమ్ముడు అడవిలో ఏమయ్యాడోనని బిగ్గరగా రోదించసాగాడు.

అప్పుడు పరంధామ్ 'నీ తమ్ముడికి కష్టంకలిగిందని నువ్వు నిజం చెప్పావు. మరి మీ తరగతిలో కూడా చాలామందికి నువ్వు కష్టం కలిగిస్తున్నావు. మరి వాళ్ల బాధ తెలియడం లేదా?' అని గద్దించాడు.

దాంతో 'ఇంక ఎప్పుడూ అలా చేయనని, తమ్ముడిని వెంటనే తీసుకు రమ్మని బతిమాలాడు శంకర్. కొడుకులో వచ్చిన మార్పుకు సంతోషించి, వెనుక వీధిలో తన స్నేహితుని ఇంట్లో వదిలివచ్చిన సుందర్‌ని ఇంటికి తీసుకువచ్చాడు పరంధామ్.

అది మొదలు తప్పులు చేయకుండా, ఇతరులపై నిందలు వేయకుండా చక్కగా చదువుకోసాగాడు శంకర్.

–దేగల అనితా సూరి

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

ఆర్.నగేష్ కుమార్, వరంగల్.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. మానవ వనరులు అనే మాట తరచు వినిపిస్తుంది. మానవ వనరులు అంటే ఏమిటి? ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల పాత్ర ఏమిటి? దయచేసి వివరించండి.

జవాబు: నగేష్ కుమార్! ప్రజలే ఏ దేశానికైనా నిజమైన సంపద. ఆర్థికాభివృద్ధిలో మానవులు ప్రదర్శించే నైపుణ్యం, సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానాలను మానవ వనరులు అని నిర్వచించవచ్చు. ఆర్థికాభివృద్ధిలో మానవుడు రెండురకాలుగా ఉపయోగపడుతున్నాడన్నది స్పష్టం. ఒకటి వనరులను ఉపయోగించి ఉత్పాదకతను పెంచటం, రెండవది ఉత్పత్తులను తన అవసరాల మేరకు వినియోగించటం. అంటే ఉత్పత్తిదారుడుగాను, వినియోగదారుడుగాను మానవుడు వ్యవహరిస్తున్నాడన్నమాట. మనదేశం విషయమే తీసుకుంటే మనకు మానవ వనరుల కొరత లేదు. ఎంతోమంది శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఇంజినీర్లు, కంప్యూటర్ నిపుణులు, వివిధరంగాలలో నైపుణ్యం గల ఎందరో శ్రామికులు విదేశాలలో పనిచేస్తుండటంతో మనదేశం కేవలం మానవ వనరుల ఉత్పత్తికేంద్రంగానే ఉండిపోయింది. మనదేశం రూపొందించిన మానవ వనరులను సంపన్న దేశాలుతక్కువ జీతాలు చెల్లించి తమ ఆర్థికాభివృద్ధిని పెంపు చేసుకొంటున్నాయి. ఉదాహరణకు గల్ఫ్ దేశాలలో ప్రకృతి వనరులైన చమురు నిక్షేపాలున్నాయి. కానీ మానవవనరులు చాలా తక్కువ కావటంతో వారు విదేశాలమీద ఆధారపడుతున్నారు. మనదేశంలో మానవ వనరులున్నా సక్రమంగా వినియోగించుకోలేకపోవటమే లోపంగా ఉంది. తలసరి ఆదాయం తక్కువ, జీవనప్రమాణాలు తక్కువ కావడంతో మానవ వనరులను పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాం. ఇటీవల ప్రపంచ దేశాలన్నీ మానవ వనరుల ప్రాముఖ్యతను గుర్తించాయి. మనదేశంలోకూడా మానవ వనరులకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసి మానవ వనరుల అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

కె.నవీన, తెనాలి.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఆరో తరగతి చదువుతున్నాను. మానవుడు మొట్టమొదట పండించిన పంటలు ఏవో దయచేసి చెప్పండి.

జవాబు: నవీనా! చరిత్రను పరిశీలిస్తే పదివేల సంవత్సరాలుగా పండిస్తున్న పంటలు గోధుమలు, బార్లీ. రాతి యుగం మనిషి మొట్టమొదటిగా గమనించిన అడవి మొక్కలు ఇవే. ఆహారం తయారీకి వాటిని వినియోగించాడు.

ఉష గాత్రం 'హుషారుగా..గమ్మత్తు'గా!

పాప్ గాయని అనగానే సాధారణంగా శ్రోత ఆ గాయనిని నవీన పోకడల్లో ఊహించుకోవడం సహజం. కానీ ఒక్కరి విషయంలో మాత్రం ఆ ఊహ తలకిందులవుతుంది. ఆ ఒక్కరి పేరు ఉషా ఉతుప్. గొంతులో ఎన్నెన్నో హొయలును ఒలికించే ఆమె భారతీయతను ప్రతిబింబించేట్లుగా చీరకట్టులో, తలనిండా పూలతో, కాసంత బొట్టుతో ఉండటం ఆమె ప్రత్యేకత. 'భారతీయ పాప్ గాయని'గా ప్రసిద్ధి చెందిన ఉషా ఉతుప్ తమిళనాడులో 1947లో మద్రాసు (నేటి చెన్నై) లో జన్మించారు. ఆమె తండ్రి సామిఅయ్యర్. ఆయన ముంబై పోలీస్ కమీషనర్‌గా పనిచేశారు. వీరింట్లో ఆమె తోటివారంతా గాయనీమణులే. ఉషకు ఇద్దరు సోదరులు.

స్వామి అయ్యర్ సంతానంలో ఉష ఐదవది. బాల్యంలో వారి కుటుంబం బొంబాయిలోని 'బైకుల్లా'లోగల లవ్‌లేన్ వద్ద ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో నివసించేది. ఉష స్థానిక సంగీత పాఠశాలలో చేరింది. పాఠశాలలో విద్యనేర్చుకుంటూ తన స్వరం తోటిపిల్లల స్వరాలతో కలవని కారణంగా ఆమెను సంగీత తరగతులనుంచి బయటకు పంపించేశారు.

ఆమె తల్లిదండ్రులు పాశ్చాత్య సంగీతం నుంచి, కిశోరి అమోంకర్, బడే గులాం అలీఖాన్ మొదలైన గాయకుల హిందుస్తానీ, కర్ణాటక సంగీతం వరకు విస్తృతశ్రేణి సంగీతాన్ని రేడియోలో వినడం అలవాటు చేసుకున్నారు. వారితోపాటు ఉష కూడా. ఆరోజుల్లో రేడియో సిలోన్ (శ్రీలంక) అత్యధికులు విని ఆనందించేవారు. వారి పొరుగున డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.ఎం.ఎ.పఠాన్ నివసిస్తుండేవారు. పఠాన్‌గారి అమ్మాయి జమీల, ఉషను హిందీ నేర్చుకోవలసిందిగా, సల్వార్ కమీజ్ ధరించమని, భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని నేర్చుకోమని ప్రేరేపించింది. ఇటువంటి మిశ్రపద్ధతి ఉషకు ఆ తర్వాత 1970లో భారతీయ పాప్ సంగీత సామ్రాజ్యాన్ని అన్వేషించేందుకు సహాయకారి అయింది. ఉష తొమ్మిదేళ్ల వయసులోనే వేదికనెక్కి పాడారు.

ఆ నాటికే సంగీతరంగంలో వృత్తికోసం అన్వేషణ సాగిస్తున్న ఆమె సోదరీమణులు ఉషను 'హమీర్ సయాని' అనే సంగీత విద్వాంసుని దగ్గరకు తీసుకువెళ్లారు. ఆయన ఉషకు రేడియో సిలోన్‌లోని 'ఓవల్టిన్ మ్యూజిక్ అవర్'లో పాడే అవకాశం కలుగజేశారు. ఆమెతో 'మాకింగ్ బర్డ్‌హిల్' అనే పాటను పాడించారు. ఆ తర్వాత ఆమె తన యుక్త వయసులో అనేక ప్రదర్శనలలో పాల్గొన్నారు. ఉషకు రాము అయ్యర్‌తో వివాహమైంది కానీ ఏవో అవాంతరాల వల్ల వారు విడిపోయారు. ఆతర్వాత కొంతకాలానికి ఆమె కేరళకు చెందిన జానీచాకో ఉతుప్‌ను వివాహం చేసుకున్నారు. అందుకే ఆమెపేరు పక్కన 'ఉతుప్' చేరి 'ఉషా ఉతుప్' అయింది.

ఉషకి ఇరవై ఏళ్ల వయసులో మద్రాసులోని మౌంట్‌రోడ్‌లోగల సఫైర్ థియేటర్ సముదాయం కిందిభాగంలో 'నైన్‌జెమ్స్'అనే పేరుతో ఉన్న చిన్న నైట్‌క్లబ్‌లో ఉష సంప్రదాయ దుస్తులు ధరించి పాడటం ప్రారంభించారు. నాడు ఆమె ప్రదర్శనలను ప్రేక్షకులు బాగా ఇష్ట పడటం గమనించిన ఆ క్లబ్ యజమాని ఉషని ఒక వారం ఉండాల్సిందిగా అభ్యర్థించాడు. ఆ తర్వాత టాక్ ఆఫ్ ది టౌన్, ట్రిన్కాస్ వంటి పలు నైట్‌క్లబ్బుల్లో పాడటం మొదలుపెట్టింది. ట్రిన్కాస్ క్లబ్బులోనే ఉష, ఉతుప్‌ను తొలిసారిగా కలుసుకుంది. ఉష దంపతులకు ఇద్దరు సంతానం..అంజలి, సన్నీ.

ఆ తర్వాత ఉష, తన తరువాత కార్యక్రమం కోసం ఢిల్లీ వెళ్లింది. అక్కడ 'ఒబెరాయ్' హోటళ్లలో పాడటం తటస్థించింది. అక్కడే అనుకోకుండా శశికపూర్‌తో 'నవకేతన్' సంస్థకు చెందిన అందాల హిందీ నటుడు హీరో దేవానంద్ సినీ నిర్మాణం బృందం ఆ నైట్‌క్లబ్‌ను సందర్శించింది. అప్పుడు ఉషా ఉతుప్‌కి సినిమాలలో నేపథ్య గాయనిగా అవకాశాన్ని కల్పించారు. తత్ఫలితంగా ఆమె 'హరేరామ, హరే కృష్ణ'తో ఆమె బాలీవుడ్‌లో కెరీర్‌ని ప్రారంభించారు. 1970కి ముందు అంటే 1968లో ఉషా ఉతుప్ రెండు పాప్ గీతాల సంకలనాలు 'జంబాలయ, 'దికింగ్స్టన్ ట్రియోలోని'; 'గ్రీన్ బాక్ డాలర్', ఆన్ యాన్ ఎప్ లవ్‌స్టోరీ, స్కాచ్ అండ్ సోడా అనే మరొక కింగ్స్టన్ ట్రియో పాటను రికార్డు చేశారు. ఇవి రెండూ భారతదేశ మార్కెట్లో బాగా అమ్ముడుపోయాయి. ఆ ప్రారంభ కాలంలో ఉష కొంతకాలం లండన్‌లో గడిపారు. 'లండన్ సౌండ్స్ ఈస్ట్రన్'లో ముఖాముఖి కార్యక్రమంలో ఉషా ఉతుప్ పాల్గొన్నారు కూడా. భారతీయ ఉత్సవంలో భాగంగా ఆమె నైరోబీ సందర్శించారు.

ఉషా ఉతుప్‌కి గల ప్రజాదరణ మూలంగా ఆమెను పర్యటన కొనసాగించవలసిందిగా ఆ దేశంవారు కోరారు. 'స్వాహిలి'లో పాడటం, తరచు జాతీయ గీతాలను ఆలపించడం ఉషకు అత్యంత ప్రజాదరణ తెచ్చిపెట్టాయి. నాటి అధ్యక్షుడు 'జోమోకెన్యట్ట' ఆమెను కెన్యా గౌరవ పౌరురాలిగా ప్రకటించడం ఎన్నదగ్గ విషయం. ఆమె సహజ గాయకుడైన 'ఫదిలి విలియమ్స్'తో కలిసి ప్రసిద్ధ గీతం 'మలైకా'ను పాడింది. ఆమె స్థానిక వాద్యబృందమైన 'ఫెలిని ఫైవ్'తో కలిసి 'లివ్ ఇన్ నైరోబి' అనే రికార్డును విడుదల చేశారు.

అనంతరం ఆమె కొన్ని బాలీవుడ్ సినిమాలకు కూడా పాటలు పాడింది. ఢోల్, జాగర్స్ పార్క్, జజంతరం, మమంతరం, ఏక్ థా రాజా, దుష్మన్ దేవతా, భవాని జంక్షన్, హమ్ పాంచ్, పూరబ్ ఔర్ పశ్చిమ్ మొదలైన చిత్రాలలో పాటలు పాడారు. ఉషా ఉతుప్ గురించి విశేషించి చెప్పాల్సివస్తే ప్రపంచవ్యాప్తంగా ఉత్సాహ భరిద మైన రంగస్థల గాయనిగా ప్రసిద్ధి పొందారు. రాజీవ్ గాంధీ పురస్కార్, అంతర్జాతీయ శాంతికోసం ఇచ్చే మహిళా శిరోమణి పురస్కారం వగైరాలు లభించాయి.

ఆమె గాయని మాత్రమే కాదు, కొన్ని చలనచిత్రాలలో నటించారు కూడా. 2006లో 'పోతెన్‌వవ' అనే మలయాళ చిత్రంలోను, 1972లో 'బాంబే టు గోవా' లో ఓ అతిధి పాత్రను పోషించారు. 2007లో అర్జున్‌దత్ చిత్రం 'బౌ బ్యారక్స్ ఫరెవర్'లోను నటించారు. సంగీత వీడియోలలోను కనిపించారు. అంతేకాదు అత్యధిక రేటింగ్ గల దక్షిణ భారతదేశ రియాల్టీ మలయాళంలోని అనేక సంగీత ప్రధాన రియాల్టీ షోలలో సహ న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించారు. ఏడుపదుల ఉషా ఉతుప్ ఇప్పటికీ హుషారుగా పాడుతూ శ్రోతలను అలరింపజేయడం నిజంగా అభినందనీయం. ఇండియన్ పాప్ చరిత్రలో ఉషా ఉతుప్‌ది ఓ ప్రత్యేక అధ్యాయం!

–మంతెన సూర్యనారాయణ రాజు

'కలరిపయట్టు'లో బామ్మగారి పట్టు!

కేరళ ప్రాచీన మార్షల్ ఆర్ట్ అయిన 'కలరిపయట్టు' ఎంతో ప్రసిద్ధిచెందింది. యువత దీనిలో సిద్ధహస్తులవటంలో వింతేమీ ఉండదు కానీ 70 సంవత్సరాల బామ్మగారు కలరిపయట్టులో ఇప్పటికీ అవలీలగా ఖడ్గాన్ని తిప్పగలదంటే ఎంత ఆశ్చర్యం! ఆ బామ్మగారి పేరు మీనాక్షి గురుక్కల్. ఆమెకు ఏడేళ్ల వయసులో ఈ కళతో పరిచయమైంది. చేతుల్లో మెరిసే పొడవాటికత్తి, డాలుతో, నిశ్చలమైన చూపుతో నిలిచే మీనాక్షిని చూస్తే కోపోద్రిక్తమైన పులి దాడికి సిద్ధంగా వున్నట్లుంటుంది. మీనాక్షికి 2016లో పద్మశ్రీ అవార్డు లభించింది. ఇలాంటి సందర్భాల్లో చాలామంది 'ఎప్పుడో రావలసింది..' అంటుంటారు. కానీ మీనాక్షిమాత్రం నేనసలు ఊహించలేదు. ఫోన్ వస్తే అదేదో పనికిమాలిందనుకున్నాను. కానీ పద్మశ్రీ వచ్చిందని తెలిసి ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యాను అంటారు. ప్రాచీన కలరిపయట్టు గురువులలో మీనాక్షి గురుక్కల్ ఒకరు.

మీనాక్షి గురుక్కల్

కేరళలోని కన్నూర్‌కు 45కి.మీ.దూరంలో ఉన్న చిన్నపట్టణం 'వడకర' ఆమె ఊరు. ఆమె ఏడేళ్ల వయసులో ఉండగా, తండ్రి ఓసారి ఓ ఎగ్జిబిషన్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ కలరిపయట్టు ప్రదర్శన జరిగింది. అది చూశాక ఆయన తన పిల్లలిద్దరికీ ఆ మార్షల్ ఆర్ట్ నేర్పించాలని నిశ్చయించుకున్నారు. మీనాక్షి కూడా ఎంతో ఆసక్తి చూపటంతో రాఘవన్ మాష్టారు వద్ద ఆమె కలరిపయట్టు నేర్చుకోవడానికి పేరు నమోదు చేశారు. అలా బోధన, సాధన సాగి చివరకు మీనాక్షి, రాఘవన్ మాష్టారినే వివాహం చేసుకుంది.

'కథనాదన్ కలరి సంగం కేంద్రం' నిర్వహణలో భర్తకు సహాయపడేది. జూన్-సెప్టెంబర్ కాలంలో కలరి శిక్షణ ఉండేది. ప్రతి సీజన్‌లో ఆరేళ్లనుంచి ఇరవై ఏళ్ల పైబడ్డవారి వరకు దాదాపు 150 మంది విద్యార్థులుండేవారు. ఉత్తర కేరళ కలరి స్టైల్‌లో దూకడం, గాలిలో విన్యాసాలు, ఖడ్గాన్ని , పెద్ద కొయ్య స్తంభాన్ని, పొడవాటి స్టీల్ రిబ్బన్‌లు (ఉర్మి) మొదలైనవి చాకచక్యంగా తిప్పటం నేర్చుకునేవారు. నేర్చుకునేవారిలో సాధారణంగా మగపిల్లలకు సమానంగా ఆడపిల్లల సంఖ్య ఉండేది. ఇంకా ముఖ్యమైన సంగతి ఏమిటంటే ఈ మార్షల్ ఆర్ట్ నేర్పడానికి ఎటువంటి రుసుము తీసుకోకపోవటం. శిక్షణ పూర్తయిన అనంతరం విద్యార్థులు తమ తాహతును బట్టి ఎంతోకొంత గురుదక్షిణగా సమర్పించుకునేవారు. తమిళ సంగం సాహిత్యంలోనే 'కలరి' ప్రస్తావన ఉంది. యుద్ధవీరులకు ఈ 'కలరి'ని నేర్పేవారు. ఉత్తర.. మధ్య కేరళ ప్రాంతాలలో, తమిళనాడులోని దక్షిణ ప్రాంతంలోను కలరిపయట్టును కేవలం పురుషులు మాత్రమే సాధనచేసేవారు. పురాణాల ప్రకారం అగస్త్య మహర్షి, పరశురాముడితో కలిసి ఈ దక్షిణ కలరిపయట్టును ఆవిష్కరించాడు. చాలా శతాబ్దాలపాటు ఈ యుద్ధకళ ప్రాచుర్యంలో ఉండి, పతనమై, పునరుద్ధరణకు నోచుకుంది.

కలరిపయట్టులో ప్రతి కదలిక (మూవ్‌మెంట్) ఎంతో అందంగా ఉండి సంప్రదాయ కేరళ నృత్యాలను తలపిస్తాయి. గిరీష్ కర్నాడ్ 1978 లో తీసిన కన్నడ చిత్రం 'ఒండనొండు కలదల్లి' పూర్తిగా ఈ యుద్ధవిద్య ఆధారంగా రూపొందించిందే. ఈ మిలీనియంలో అశోక, ది మిత్, ది లాస్ట్ లెజియన్, మనసర, కమాండో, బాఘీ మొదలైన చిత్రాల్లో 'కలరి' కళను చూడవచ్చు.

మీనాక్షి అమ్మ కలరియపట్టు నేర్చుకొనే రోజుల్లో కలరి నేర్చుకునే అమ్మాయిల సంఖ్య వేళ్లమీద లెక్కపెట్టేట్లు ఉండేది. 1950 వరకు కూడా మనదేశంలో పెద్దలు అమ్మాయిలను ఈ యుద్ధవిద్యకు అనుమతించేవారుకాదు. మీనాక్షి కూడా వివాహానంతరం నాలుగ్గోడల లోపలే కలరిని సాధన చేయగలిగింది. విద్యార్థుల బాగోగులు చూడటం, రాఘవన్ లేనపుడు వారిచేత సాధన చేయించడం చేసేది. రాఘవన్ మరణానంతరమే అంటే దాదాపు 8 ఏళ్ల నుంచి ఆమె తమ సంస్థ బాధ్యతలు స్వీకరించి, బహిరంగంగా బోధన, ప్రదర్శనలు ఇవ్వసాగింది.

దాదాపు అయిదు శతాబ్దాలు ఇంటి పరదాల వెనుకే చేసిన సాధన భర్త మరణానంతరం సంస్థ నిర్వహణకు ఎంతగానో తోడ్పడింది. 'కలరిపయట్టు' ప్రతి ఒక్కరికి కులం, ఆడ, మగ తేడాల్లేకుండా అందరికీ అందుబాటులో ఉండాలన్నది నా భర్త కోరిక. ఆయన నేర్చుకున్న సమయంలో వివక్షనెదుర్కోవటంతో ఆయన తాను ప్రతిఒక్కరికీ, అంటే నేర్చుకోవాలని అభిలాష కల అందరికీ నేర్పుతానని ప్రతిజ్ఞ చేశారు' అంటారు మీనాక్షి.

'కలరిపయట్టు' నేర్చుకోవటం వల్ల కేవలం ఆపద సమయంలో ఉపయోగపడటమే కాదు, అది నేర్చుకున్నవారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆయుధాలతో పనిలేదు. కేవలం చేతులతో, కాళ్లతో చేసే యుద్ధ విన్యాసాలను మేము నేర్పుతాం. నిజానికి 'కలరి'లో ఇదే ప్రధానమైన, ప్రాథమికమైన శిక్షణ'.

'కలరిపయట్టు' నేర్చుకునేటప్పుడు కొన్నిసార్లు గాయపడటం సహజం. మీనాక్షి అమ్మకు కూడా కంటికింద గాయపు గుర్తు ఇప్పటికీ కనిపిస్తుంది. వైద్యపరమైన ప్రత్యేక ఆయిల్ మసాజ్‌తో ఆ గాయాలు త్వరగా తగ్గిపోయేలా చేస్తారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వని కాలంలో మీనాక్షి 'కలరిపయట్టు' ప్రదర్శనలిస్తుంటారు. ఈ వయసులో కూడా తమ విద్యార్థి సాజిల్‌తో కలిసి 60కి పైగా ప్రదర్శనలిచ్చారు. రాఘవన్ దగ్గర కలరిపయట్టు నేర్చుకున్న పూర్వ విద్యార్థులెందరో ఇప్పుడు సొంతగా శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేసుకున్నారు. మీనాక్షి అమ్మ కుటుంబం మొత్తం..ఆమె కొడుకులు, కుమార్తెలు, మనవడు కూడా 'కలరిపయట్టు' సాధకులే. 'కలరిపయట్టు' కొన్ని కాలాలపాటు వర్ధిల్లుతుందని వారి విశ్వాసం.

కథ

తరాల అంతరాలు

"ఏమండోయ్! మేడ మీద పోర్షన్‌లో కొత్తగా దిగిన పెద్దాయనగారు ఎందుకో మిమ్మల్ని పిలుస్తున్నారు.. ఒక్కసారి వెళ్లండి" అంటూ అర్చన వంటింటిలోంచి కేక వెయ్యడంతో పేపర్ని టేబులు మీద పెట్టి లోపలికి వచ్చాడు ప్రభాకర్.

"ఏంటి అర్చనా? ఏం జరిగింది? ఎందుకాయన పిలుస్తున్నాడు? వాళ్ల సామాన్లు పూర్తిగా వచ్చేశాయా?" షర్టు వేసుకుంటూ అడిగాడు, ప్రభాకర్.

"నిన్న సాయంత్రమే అన్ని సామాన్లు వచ్చేసాయి. పాపం.. ఇద్దరూ పెద్దవాళ్లు. ఈ వయ సులో ఆ దంపతులిద్దరూ ఈ మేడ మీద ఎలా ఉంటారో ఏమో! ఉదయం నుంచి నీళ్లు రావట్లేదని ఆవిడ గాబరా పడుతోంది. ఒక్క సారి మీదకు వెళ్లి కనుక్కోండి" అంది, అర్చన కాఫీ ఇస్తూ.

"ఇంతకూ వాళ్లది ఏ ఊరట? వాళ్లకు పిల్లలు లేరా?" ప్రభాకర్ ప్రశ్నలు వేస్తుంటే-

"అబ్బబ్బ ఆ విషయాలేవీ కనుక్కోలేదు గానీ మీరు ముందు వెళ్లరూ. నిన్నటిదాకా వాళ్ల పెద్దబ్బాయి దగ్గరే ఈ ఊళ్లోనే వుండే వారట. ఏవో సమస్యలొచ్చి వుంటాయి. అందుకే అద్దెకొచ్చినట్లున్నారు" విసుక్కుంటూ అంది, అర్చన.

"వెళ్తున్నా... నీకు మరీ తొందర? వెళ్లే ముందర వాళ్ల విషయాలు తెలుసుకుంటే మంచిది కదా అని నా అభిప్రాయం"

"మాస్టారుగారిది ఈ ఊరే. ఇక్కడి కాలేజీలోనే తెలుగు లెక్చరర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారుట. అతని కొడుకు కూడా ఇక్కడే మాథ్స్ లెక్చరరట. సరేగానీ మీరు త్వరగా వెళ్లండి. వాళ్లు మీ గురించి వెయిట్ చేస్తున్నారు" అంటూ అర్చన తొందర పెట్టడంతో ఆలోచిస్తూ మేడ ఎక్కాడు ప్రభాకర్.

మూడు నెలల నుంచి మేడమీద పోర్షన్ ఖాళీగా వుంది. ఇంకెవ్వరికీ అద్దెకు ఇవ్వొద్దని అర్చనకు చెప్పినా ఒంటరిగా అంత పెద్ద ఇంట్లో వుండటం కష్టమని ఎవరైనా వస్తే తనకు టైం పాస్ అవుతుందని ఆమె అద్దెకిచ్చింది.

మేడ మీద అరవై ఏళ్ల ముసలాయన పుస్తకాలతో కుస్తీ పడుతూ కనిపించాడు. ఇంకా ఇల్లు సర్దుకున్నట్లు లేదు. అందుకే సామాన్లన్నీ చిందరవందరగా పడి వున్నాయి.

"నమస్కారం మాస్టారు.. నా పేరు ప్రభాకర్" అంటూ అతను ఇంకేమో చెప్పబోతుంటే-

"ఓహో.. మీరేనా ప్రభాకర్. రండి రండి. మీ గురించి అమ్మాయి చెప్పింది. ఏంలేదు...

- గన్నవరపు నరసింహమూర్తి

పంపులో నీళ్లు రావట్లేదు. బహుశ మేడమీద ట్యాంక్ దగ్గర బందు చేసినట్లున్నారు. దాన్ని కొంచెం సరిచేస్తే నీళ్లు వస్తాయి. మీకు ఇబ్బంది పెడుతున్నందుకు క్షమించండి" అంటూ చెప్పాడు.

"ఏం ఫరవాలేదు మాస్టారు" అని ప్రభాకర్ మేడ ఎక్కి ట్యాంక్ దగ్గర స్టాప్ కాక్‌ని సరిచేసి కిందకు వచ్చి "మాస్టారూ! ఇప్పుడు కొళాయి ఆన్ చేయండి" అంటూ చెబుతుండగానే లోపలినుంచి ఆయన భార్య బయటకు వచ్చి-

"ఇప్పుడు నీళ్లు వస్తున్నాయి బాబూ. ఈ నీళ్లు రాక ఉదయం నుంచీ చాలా గాబరా పడ్డాను" అంటూ ఆనందంగా చెప్పింది.

ఆవిడను చూడగానే నాకు మా అమ్మ గుర్తుకు వచ్చింది. మా అమ్మ కూడా ఈవిడ లాగే ప్రతి విషయానికీ గాభరా పడుతుంటుంది.

"సరేలేమ్మా! ఇంకా ఏమైనా సమస్యలుంటే చెప్పండి. అన్నట్లు పాలు తీసుకున్నారా? లేకపోతే మా పాలవాడికి మీకు రోజూ ఇమ్మని చెబుతాను. ఒకవేళ ఈ రోజుకు లేకపోతే మా ఇంట్లోంచి తీసుకోండి" అన్నాడు ప్రభాకర్.

"ఉదయాన్నే మీ ఆవిడ వచ్చి పాల పాకెట్ ఇచ్చింది నాయనా! దాంతోనే ఈ పూట కాఫీలయ్యాయి. ఒక్క క్షణం కూర్చో బాబు. కాఫీ తాగివెళుదువుగాని..." అంటూ ఆవిడ లోపలికి వెళ్లింది.

ప్రభాకర్ వద్దని చెబుదామనుకున్నాడు. కానీ అప్పటికే ఆవిడ లోపలికి వెళ్లిపోవడంతో చేసేది లేక మాస్టారిగారి దగ్గరకొచ్చి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. అతనికెదురుగా వున్న టేబుల్ మీద సుమారు నాలుగైదు వందల పుస్తకాలున్నాయి.

వాటినన్నింటినీ ఆయన ఎదురుగా వున్న అల్మారాలో ఓపిగ్గా సర్దుతున్నాడు. ప్రభాకర్‌ని చూడగానే ఆ పని ఆపి "మీకు బాగా శ్రమ ఇచ్చినట్లున్నాం. ఏమీ అనుకోవద్దు" అన్నాడు.

"అబ్బే అదేంలేదు మాస్టారూ" అని ఆ పుస్తకాల వైపు విస్మయంగా చూస్తూ- "మీకు పుస్తకాలంటే బాగా ఇష్టమా?" అని అడిగాడు.

"ఇష్టం అంటావేంటయ్యా, ప్రాణం. వీటివల్లే కదా ఈ వయసులో అద్దె ఇంటికి రావలసి వచ్చింది" అన్నాడు నవ్వుతూ.



నిజానికి ఆయన్ని చూస్తే పదవీ విరమణ చేసిన వ్యక్తిలా లేడు. చురుకైన యువకుడి లాగే కనిపిస్తున్నాడు. కళ్లల్లో చురుకుదనం, ముఖంలో చిరునవ్వు, తెలుపు నలుపు జుట్టు, మాటల్లో హుందాతనం... అన్నీ కలిసి అతనో స్థితప్రజ్ఞుడిలా కనిపించ సాగాడు.

"పుస్తకాల వల్ల ఇక్కడకు రావలసి వచ్చిందా? కొంచెం వివరంగా చెప్పండి... మీకభ్యంతరం లేకపోతే.."

"నా పేరు శ్రీనివాసరావు. ఇక్కడే కాలేజీలో లెక్చరర్‌గా క్రితం సంవత్సరం పదవీ విరమణ చేసాను. చిన్నప్పట్నుంచి పుస్తకాలంటే నాకు వల్లమాలిన ప్రేమ. భోజనమైనా మానివేసేవాడిని గానీ చదవడం మానేసేవాణ్ని కాను. మరీముఖ్యంగా తెలుగు సాహిత్యం అంటే ప్రాణం. అది పదవీ విరమణ తరువాత మరింత పెరిగింది. దానివల్ల ఇల్లు పట్టలేనన్ని పుస్తకాలు. కానీ మా అబ్బాయికి, కోడలికి, మనవలకు ఇష్టం లేదు. అదీ సమస్య..." చెబుతూ మధ్యలో ఆగేడు.

కొద్దిసేపు అక్కడ నిశ్శబ్దం.

ఇంతలో అతని భార్య ట్రేలో రెండు కప్పులతో కాఫీలు పట్టుకొచ్చింది. ఆమెను చూపిస్తూ "ఈమె విమల.. నా భార్య" అంటూ పరిచయం చేసాడు.

ప్రభాకర్ ఆవికు నమస్కారం పెట్టాడు.

"నిజానికి మీ ఆవిడకి దండం పెట్టాలయ్యా. నిన్నటి నుంచి మాకు ఎంతో సహాయం చేసింది. మేం తొందరలో హడావుడిగా వచ్చేయడంతో చాలా సామానులు మరిచిపోవడంతో మీకు ఇబ్బంది కలిగించాం. ఏమీ అనుకోవద్దు..." అందావిడ, కాఫీగ్లాసు అందుకుంటూ.

"మరేమీ పరవాలేదు. మీకింకేమి అవసరమో చెప్పండి. ఈరోజు నాకు బ్యాంకు సెలవే. కావలిస్తే తెస్తాను" అన్నాడు ప్రభాకర్.

ఇంతలో ప్రభాకర్ దృష్టి టేబుల్ మీదున్న వేయిపడగలు పుస్తకంపైన పడింది.

"మాస్టారుగారు... మీ దగ్గర వేయి పడగలు కూడా ఉందా? నేను కాలేజీలో చదువుకున్నప్పట్నుంచి ఈ పుస్తకాన్ని చదవాలని ఎంతగానో ప్రయత్నించాను. కానీ కుదరలేదు. మీకు అభ్యంతరం లేకపోతే ఈ పుస్తకం ఇవ్వండి" ఆ పుస్తకాన్ని తెస్తూ అడిగాడు.

"ఇస్తారా? అని అడగాలటయ్యా. నీకిష్టం అయిన పుస్తకాలను నిరభ్యంతరంగా తీసుకెళ్లు. నీక్కూడా పుస్తకాలంటే ఇష్టమా?"

"అవును మాస్టారు..." అంటూ వేయి పడగలు పేజీలు తిప్పసాగాడు ప్రభాకర్. ఆ తరువాత షెల్ఫ్ దగ్గరికి వెళ్లి అందులో వున్న పుస్తకాలను చూడటం మొదలుపెట్టాడు. వాటిని చూస్తూ వుంటే అతనికి మతి పోసాగింది.

అక్కడ తెలుగు సాహిత్యంలో కలికి తురాయిల్లాంటి పుస్తకాలు అందంగా పేర్చ బడి వున్నాయి. గురజాడవారి కన్యాశుల్కం నుంచి దేవులపల్లి ఊర్వశిదాకా. తిలక్ అమృతం కురిసిన రాత్రి నుంచి బుచ్చిబాబు చివరకు మిగిలేది వరకు అక్కడ వున్నాయి.

చాలాసేపు వాటిని చూసిన తరువాత అక్కడినుంచి లేస్తూ "వస్తాను మాస్టారూ. అన్నట్లు చెప్పడం మరిచాను... నేనిక్కడి స్టేట్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తు న్నాను. బ్యాంకు పనుల్లో మీకేమైనా సహాయం కావలిస్తే చెప్పండి, చేసి పెడ తాను. మళ్లీ సాయంత్రం వస్తాను" అంటూ ప్రభాకర్ కిందకు వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం ప్రభాకర్ టీవీ చూస్తుం డగా ఆరవ తరగతి చదువుతున్న అతని కొడుకు చరణ్ వచ్చి "నాన్నగారూ! మేడమీద తాతగారు మీరు ఖాళీగా వుంటే వస్తారుట" అని చెప్పగానే టీవీని ఆపు చేసి మేడ మీదకు వెళ్లాడు.

అతన్ని చూడగానే రావుగారు " అరె! నేనే మీ దగ్గరకు వద్దామనుకుంటుంటే మీరే వచ్చారు... రండి" అంటూ కుర్చీ చూపిం చాడు.

"మీకేమైనా అవసరం అయితే నన్ను

"నిజానికి మీ ఆవిడకి దండం పెట్టాలయ్యా. నిన్నటి నుంచి మాకు ఎంతో సహాయం చేసింది. మేం తొందరలో హడావుడిగా వచ్చేయడంతో చాలా సామానులు మరిచిపోవడంతో మీకు ఇబ్బంది కలిగించాం. ఏమీ అనుకోవద్దు..." అందావిడ, కాఫీగ్లాసు అందుకుంటూ.

పిలవండి. మీరు అస్తమానం కిందకు రాలేరు" అంటూ కుర్చీలో కూర్చుంటూ "ఇప్పుడు చెప్పండి..."అన్నాడు.

"మరేంలేదు ప్రభాకర్‌గారూ! నేను సంవత్సరం క్రితం నా పెన్షనుకోసం లైవ్ సర్టిఫికెట్ మీ బ్యాంకువాళ్లకు ఇచ్చాను. మళ్లీ ఈ సంవత్సరం ఫ్రెష్‌గా ఇమ్మంటున్నారు. అదుకని రేపు మీరు బ్యాంకుకు వెళ్తున్నప్పుడు పిలిస్తే నేను వస్తాను".

"ఓహో! దాని గురించా? దానికోసం మీరు రానక్కరలేదు. ఆ సర్టిఫికెట్‌ని నాకిచ్చే యండి. నేను మా వాళ్లకి ఇచ్చేస్తాను...." అన్నాడు.

"చాలా థాంక్స్ బాబు"

"మాస్టారుగారూ! మీ అబ్బాయి ఇక్కడే లెక్చరర్‌గా పని చేస్తున్నాడని విన్నాను. మీకు ఇక్కడ స్వంత ఇల్లు కూడా ఉందని విన్నాను. అటువంటిది మీరు అద్దె ఇంట్లో దిగడానికి కారణం? ఇలా అడుగుతు న్నందుకు ఏమీ అనుకోవద్దు. మీకిష్టం అయితేనే చెప్పండి"

"ఇందులో తప్పేంవుంది ప్రభాకర్‌గారూ! నేను రెండేళ్ల క్రితం ఇక్కడి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పదవీ విరమణ చేసాను. ఆ తరువాత ఇల్లు కట్టుకున్నాను. అదృష్టవశాత్తు మా అబ్బాయికి కూడా ఇక్కడే లెక్చరర్‌గా ఉద్యోగం రావడంతో అందరం కలిసే వుండేవాళ్లం.

కానీ... రాను రాను ఆ ఇల్లు మాకు సరిపోలేదు. అందులో సగం ఈ పుస్తకాలే ఆక్రమించడంతో మా అబ్బాయి, కోడలు విసుక్కోవడం నాకు బాధ కలిగించింది. అదీగాక పిల్లల చదువులు పాడవుతున్నాయని మా కోడలు బాహాటంగానే అనడంతో మా ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చింది. దీనికితోడు క్రితం సంవత్సరం మా మనవ రాలి పెళ్లి విషయంలో మా తండ్రీ-కొడుకుల మధ్య అభిప్రాయ భేదాలొచ్చాయి.

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టులనుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

నేను అమెరికా సంబంధం వద్దంటే మనవ రాలితో సహా అందరు నాకు వ్యతిరేకం అయ్యారు. చివరకు ఆ అబ్బాయితోనే దాని పెళ్లి నిశ్చయం అయింది. ఇంకా పెళ్లి కాలేద నుకోండి. ఆ సంఘటన తరువాత మా మధ్య దూరం మరింత పెరిగి వేరే ఇంటికి వెళ్లిపోతామంటే నేనే వాళ్లని వారించి, ఇలా మీ ఇంటికి అద్దెకు వచ్చాం. ఇదీ జరిగిన సంగతి...” అంటూ చెప్పడం ముగించాడా యన.

అతని మాటలు విన్నాక ప్రభాకరానికి బాధ కలిగింది. ఈ వయసులో ఆ దంప తులకు స్వంతింటిని వదిలి అద్దింట్లో వుండటం చాలా బాధాకరమైన విషయమే.. అనిపించింది అతనికి.

* * *

ఆ రోజు ఆదివారం. కొత్త పుస్తకాలు తెచ్చుకోవాలని ప్రభాకరం మేడ మీదకు వెళ్లేసరికి మాస్టారుగారు పుస్తక పఠనంలో మునిగిపోయి వున్నారు. అతన్ని చూసి “రండి... మీ కోసమే చూస్తున్నాను. ఇదిగో మీరు అడిగిన ‘అమృతం కురిసిన రాత్రి’ పుస్తకం. వచన కవిత్వంలో తెలుగులో ఇంత కన్నా మంచి పుస్తకం లేదని చెప్పొచ్చు. దీన్ని చదవండి” అంటూ ఆ పుస్తకాన్ని ఇచ్చా డాయన ప్రభాకరానికి.

ఇంతలో పొడవుగా, తెల్లగా వున్న ఓ వ్యక్తి లోపలికి వచ్చాడు. అతన్ని చూడగానే మాస్టారు ఆశ్చర్యంగా ముఖం పెట్టి “విమలా! అబ్బాయి రామం వచ్చాడు” అంటూ ప్రభాకరం వైపు తిరిగి– “మీకు చెప్పానే వీడే మా అబ్బాయి రఘురాం, ఇక్కడే లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు”

“వీరు ప్రభాకరంగారు, ఈ ఇంటి యజ మాని. ఇక్కడి బ్యాంకులో మేనేజర్” అంటూ పరిచయం చేసారు రావుగారు.

“మాస్టారూ మీరు మాట్లాడుతుండండి. నేను మళ్లీ వస్తాను...” అంటూ కిందకు వెళ్లిపోయాడు ప్రభాకరం.

అతన్ని చూసి అర్చన “చూసారా! తల్లి తండ్రులిక్కడికి వచ్చిన ఆరు నెలల తరువాత కొడుకు ఇప్పుడొచ్చాడు. ఇన్నాళ్లు ఊళ్లోనే వున్నా కనీసం ఈ వృద్ధులు ఎలా వున్నారో నన్న ధ్యాసే లేదు వాళ్లకి. కనీసం మనవడు, మనవరాలు అయినా రాలేదని విమలమ్మ గారు రోజూ బాధపడుతుంటారు.

అక్కడున్నప్పుడు ఇప్పుడు పెళ్లి కాబోతున్న మనవరాలు ఈవిడని వదలి క్షణం కూడా వదలి వుండేది కాదట. ఏమిటో ఈ కాలం పిల్లలు...” అంది.

“గట్టిగా అనకు అర్చనా. వాళ్లు వింటే బాధపడతారు. పాపం... వాళ్ల అబ్బాయి మాత్రం ఏం చేస్తాడు చెప్పు? ఈ కాలం పిల్లలే అంత. వాళ్లకెంతసేపూ చదువు పూర్తి కాగానే అమెరికా వెళ్లిపోవాలన్న ధ్యాసే తప్ప ఇక్కడున్న తల్లిదండ్రుల గురించి గానీ పెద్దల గురించి గానీ వాళ్లు ఆలోచించటం లేదు.

ఆ సాయంత్రం ప్రభాకర్ మాస్టారు ఇంటికి వెళ్లినప్పుడు అతని కొడుకు ప్రస్తావన వచ్చింది.

“మా మనవరాలు కృతికి ఆ రోజున మేం వద్దన్నా ఆ అమెరికా సంబంధం కుదిర్చాడు. దీనికంతటికీ కారణం మా కోడలే. ఆవిడకు అమెరికా మోజు. మా వాడు వొట్టి అమాయకుడు. పెళ్లాం ఎంత చెబితే అంతే వాడికి. వాళ్లకి పియఫ్ లోన్ పెట్టి కట్నం అడ్వాన్సుగా కూడా ఇచ్చాడు. ఆ సమయంలో నా డిసిఆర్‌జి, పిఎఫ్ డబ్బులు పది లక్షలు రావడంతో ఆ డబ్బుని తన కూతురి కట్నంకోసం ఇమ్మంటే నేనివ్వనన్నాను. అదీగాక ఆ సంబంధం వద్దని మరీ మరీ చెప్పాను. అది చిలికి చిలికి గాలివాన అయి ఇలా మేం బయటకు రావ లసి వచ్చింది. ఇంతకీ అసలు విషయం చెప్పలేదు కదూ. నిన్న ఆ పెళ్లివాళ్లు మళ్లీ కబురు పెట్టి మరో పది లక్షలు కట్నం ఇస్తేనే పెళ్లి అవుతుందని, లేకపోతే ఇంకో సంబంధం చూసుకోమని చెప్పారుట. అందుకే ఎలాగైనా ఇల్లు తాకట్టు పెట్టి ఆ డబ్బు సర్దమని నన్ను అడగటానికి మా వాడు వచ్చాడు. చూడండి ఎంత ఘోరమైన మనుషులో వాళ్లు?” కోపంగా చెప్పాడు శ్రీనివాసరావు.

“మరి మీరేం చెప్పారు?”

“నేను చచ్చినా సరే ఆ ఇల్లు అమ్మనని చెప్పాను పైగా వాళ్లు డబ్బు మనుషుల్లా వున్నారు. అలాంటి వాళ్లకి పిల్లనిస్తే ఆమె జీవితం సాఫీగా సాగదు” అని చెప్పాను. పెళ్లి కేన్సిల్ చేసి ఇచ్చిన డబ్బును తిరిగి తీసుకోమని భార్యాభర్తలిద్దరం చెప్పాం”.

“మంచి పని చేసారు మాస్టారూ. ఇవాళ అమెరికా సంబంధాలు బాగా ఫ్యాషను అయిపోయాయి. ఒకపక్క లక్షల్లో జీతాలం టారు. మరోపక్క లక్షల్లో కట్నాలు కావాలి వాళ్లకి. పెళ్లి తరువాత వాళ్ల వేధింపులకు అంతుండదు. అలాంటి సంబంధాలు చేసుకోకపోవడమే మంచిది” అన్నాడు ప్రభాకర్.

ఈ సంఘటన జరిగిన నెల రోజుల తరు వాత ఒకరోజు మాస్టారు, అతని కొడుకు కలసి ప్రభాకరం ఇంటికి వచ్చారు. మాస్టారి గారబ్బాయి చేతిలో శుభలేఖల కట్ట వుంది. ముందుగా మాస్టారుగారు “మా మనవరాలి కృతికి పదిహేను రోజుల్లో పెళ్లి ప్రభాకరం గారూ! అనుకున్నట్లే ఆ అమెరికా సంబం ధాన్ని రద్దు చేసి విశాఖలో తెలుగు లెక్చ రర్‌గా చేస్తున్న అబ్బాయితో పెళ్లి కుదిర్చాం. మీరు, అమ్మాయి తప్పక రావాలి” అన్నారు శుభలేఖ ఇస్తూ.

ఆ మాటలు విన్న ప్రభా కరం “చాలా మంచి వార్త చెప్పారు మాస్టారుగారూ. శుభస్య శీఘ్రం. ఎంతయినా మీ మనవరాలు అదృష్టవం తురాలు. ఆ అమెరికా సంబంధం నుంచి మీరే కాపాడేరు” అన్నాడు.

ఆ తరువాత వాళ్లు కాఫీ తాగి వెళ్లిపోయారు.

* * *

అనుకున్నట్లుగానే మాస్టారుగారి మనవ రాలి వివాహం పదిహేను రోజుల్లో జరిగిపో యింది. ప్రభాకరం దంపతులిద్దరూ ఆ పెళ్లికి వెళ్లి వధూవరుల్ని ఆశీర్వదించి వచ్చారు. పెళ్లి అయిన పది రోజుల తరువాత మాస్టారుగారి దంపతులిద్దరూ ప్రభాకరం ఇంటికి వచ్చారు.

“అన్నీ సవ్యంగా జరిగిపోయాయి కదా!” అని ప్రభాకరం అడిగాడు.

“ఏదో మీ దయవల్ల ప్రభాకరంగారూ. ఇప్పుడు నాకు ప్రశాంతంగా వుంది. పిల్ల వాడు చాలా బుద్ధిమంతుడు. ఇంతకీ అసలు విషయం– మేం వారం రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలనుకుంటున్నాం. నిజానికి ఇక్కడ మాకు హాయిగానే వుంది. మాకు కూడా అక్కడికి వెళ్లాలని లేదు. కానీ మా అబ్బాయి, కోడలు ముఖ్యంగా మా మనవ రాలు కృతి ఒప్పుకోవటం లేదు. ఇప్పుడు వాళ్లందర్లో బాగా మార్పు వచ్చింది. నిజానికి మనుషుల విలువ దూరంగా ఉంటేనే తెలు స్తుంది. మేం అక్కడున్నాళ్లు మా విలువ వాళ్లకి తెలీలేదు. అయినా ఇప్పటికయినా గ్రహించినందుకు మాకు చాలా సంతోషంగా ఉందండి....” అన్నారు.

“మీరు మీ ఇంటికి వెళ్లిపోతున్నందుకు ఒక విధంగా మాకు సంతోషంగా వున్నా ఇంకో విధంగా బాధగా కూడా వుంది మాస్టారుగారు. అయినా సరే మీరు అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూ వుండాలి” అన్నారు ప్రభాకరం దంపతులు.

“తప్పకుండా...” అంటూ వాళ్లు వెళ్లిపో యారు.

వెళ్లిపోతున్న ఆ వృద్ధ దంపతుల్ని చూస్తుంటే అర్చన కళ్లల్లో నీళ్లు చెమర్చసాగాయి.

■

అన్నదాతా! సుఖీభవ!!

ఈ వారం కవిత్వం

పల్లె అయినా పట్టణమైనా
ప్రతి క్షణం ప్రకృతి నిన్ను ప్రేమగా
పలకరిస్తూనే ఉంటుంది.
కాని...
నాట్లు వేసే సమయాన నాలుగు
వానచుక్కలు పడకపోతే
బీడువారిన భూమిన దిగిన నాగలి నీ
గుండెను రెండుగా చీల్చుతుంది
కోత కోసే సమయాన చుక్కల వాన
లెక్కకు మించితే
ఎదిగిన పంట కన్నీట
మునిగిపోతుంది.
ఏదైనా నీకు నష్టమే.
కడుపు నింపని తాలు గింజలు నీ
చేతకానితనాన్ని వెక్కిరిస్తుంటే
అప్పిచ్చినవారు అసలు ఏదని
పీడిస్తుంటే
సర్కారు సహాయాన్ని
ఆశించావు....సహచరుల సాయాన్ని
అర్థించావు.
ఐనా నమ్ముకున్న నేల అమ్ముకానికి
పోయింది
నేల తల్లి మీద నీకున్న నమ్మకం
నీరుగారిపోయింది.
అందుకేనా పురితాడును ఉరితాడుగా
మలిచావ్?
కట్టుకున్న ఆలికి అంత పెద్ద శిక్ష
వేశావ్?
కన్నబిడ్డలను కఠిన సమాజానికి
వదిలేశావ్....
ఒక్కటి మాత్రం నిజం రైతన్నా....
అన్నదాతవు నీవు.... అర్ధాంతరంగా
చావకూడదు.
నీకు నువ్వు శిక్ష వేసుకుంటే
సమాజాన్ని నువ్వు శిక్షించినట్లే
ఆత్మహత్యకు బదులు ఆత్మరక్షణ
చేసుకుంటే అన్నపూర్ణను నువ్వు
ఆదరించినట్లే.
నీ బతుకు బాటలో దేశ భవిత
భద్రంగా ఉంది.
నీ శ్రమైక సౌందర్యంలో భవిష్య
భారతం ఉంది.
అందుకే...
నీకు జోహారులర్పిస్తోంది..
శత సహస్ర వందనాలతో నీకు
శతమానం భవతి!

– కర్రా అంజలి

కళ్లు

తనయుని అభ్యున్నతికై
అహర్నిశలూ తపించే
తల్లి మనసుకై
ఆశగ ఎదురుచూస్తాయి నా కళ్లు.

నిష్కల్మషమౌ ప్రియుని
ప్రేమ సందేశంకోసం పరితపించే
ప్రియురాలి మనోవేదనకై
ఆశగా ఎదురుచూస్తాయి నా కళ్లు.

కమనీయమౌ కనుల విందొనర్చు
కమ్మని తావులొసగు పూలసొగసులకై
ఆశగా ఎదురు చూస్తాయి నా కళ్లు

హృదయ తంత్రులు మీటు
నవ రసాలొలుకు
గాత్ర మాధుర్యంకోసం తపించే
రసజ్ఞులకై
ఆశగా ఎదురు చూస్తాయి నా కళ్లు.

పసివాడని బాలల కేరింతల్లో
ఆనందాలను చవిచూసే
సహృదయుల చూడ
జాలిగ ఎదురు చూస్తాయి నా కళ్లు

సంగీత సాహిత్య రసడోలల్లో
నాట్య విన్యాసముల తేలే
అందగత్తెల గాత్ర మాధుర్యముకై
ఆశగ ఎదురుచూస్తాయి నా కళ్లు

ఈర్ష్యాసూయలకు
తావివ్వని దివ్య రూపముల
దివ్యమూర్తులకై
ఆశగ ఎదురుచూస్తాయి నా కళ్లు.

– యలమంచిలి శివాజీ

కవి కలలు

యుద్ధాలు మన వైఖరుల్ని
మారుస్తున్నాయి...
ఏ మూలన జరిగిన సమరమైనా
విశ్వమానవ సమూహాలకు
కొత్త పాఠమేదో బోధిస్తూనే ఉంది...
ఇన్నాళ్లు రాసుకున్న
మానవీయ సైద్ధాంతిక పూలు
వాడిపోతున్నాయి....
ఇప్పుడు, ఎవరి జాగాను వారు కంచె
వేసి,
రక్షించుకోవాల్సిన సమయం
దాపురించింది.....
సరిహద్దుల్ని తుడిచేసి
హృదయాల్ని పెనవేసే
విశ్వగీతమేదైనా మోగుతుందేమోనని
ఆశ సన్నగిల్లుతుంది...
కానీ, హృదయాలు అమృతం రుచి
చూసాక
విశ్వప్రేమ... స్వేచ్ఛను చూసాక
ఇక్కడ కవి కలలు
శాంతిగీతాలే ఆలపిస్తాయి...
విశ్వశాంతికోసమే కలలు
కంటాయి...!!

– తంగెళ్లపల్లి కనకాచారి

హైకూలు

వసంతగానం
ఉగాది ఉషోదయం
చేదు, తియ్యన!

తాతయ్య వీపు
గుర్రమెక్కిన బాల్యం
తీపి జ్ఞాపకం!

సరదా సెల్ఫీ
కారాదు, అది కిల్ఫీ
అతి ఎందుకు!

నదీ ప్రవాహం
అంతులేని ప్రయాణం
నవ జీవనం!

రివ్వున గాలి
శృతిలయల కేళి
గానలహరి!

చీకటి వేషం
కాలంతో సమావేశం
తెల్లారయింది!

కొబ్బరి చెట్టు
చంద్రుడ్ని ముద్దాడింది
పచ్చని ప్రేమ!

– బి.గోవర్ధనరావు

సింగిల్ పేజీ కథ

స్థానిక సమాచారం

– వియోగి

"యస్! కమిన్!" అన్నాడు చదువుతున్న పుస్తకాన్ని మూసివేస్తూ ప్రిన్సిపల్ వాదిరాజు, తన గది తలుపు మీద టకటక చప్పుడు విని.

మెలికలు తిరిగిపోతూ వచ్చాడు యాదగిరి "సార్ సార్" అంటూ.

"అదేంటి యాదగిరి! స్ప్రింగ్‌ను మింగేసినట్లు మెలికలు తిరిగిపోతున్నావు? ఏమైంది?! ఆశ్చర్యంగా అడిగాడు వాదిరాజు.

"సార్! నేను చచ్చిపోతాను సార్! నేను చచ్చిపోతాను" వగరుస్తూ అన్నాడు యాదగిరి కడుపును చేత్తో నొక్కుకుంటూ.

"ఫర్వాలేదు... అందరూ పోయేవాళ్లమే, ఏమైంది నీకు?"

"ఇంకా ఏం కావాలి సార్? కడుపునెప్పి! భరించలేని కడుపు నెప్పి!"

"సడెన్‌గా వచ్చినట్లుంది. ఇందాక ప్రార్థన చేస్తున్నప్పుడు బాగానే ఉన్నావే!" సాలోచనగా అన్నాడు వాదిరాజు. తొమ్మిదింపావుకు విద్యార్థినీ విద్యార్థులందరూ గ్రౌండులో ప్రార్థన చేస్తారు. అప్పుడు టీచర్లందరూ కూడా హాజరు అవుతారు. అది జరిగి అరగంట దాటింది. అంతే!

"అవును సార్! పొద్దున బాగానే ఉన్నాను సార్! ఇందాకటి నుండి జస్ట్ ఓ పదిహేను నిమిషాల నుండి విపరీతమైన కడుపు నెప్పి సార్!"

"అయ్యో పాపం! మన అటెండరుకు చెప్పి టాబ్లెట్లు తెప్పిస్తాను. వేసుకుని మన స్టాఫ్ రూమ్‌లో కూర్చోండి తగ్గేదాకా!" చెప్పాడు జాలిగా.

"అయ్యో! ఇది అలా తగ్గదు సార్! ఇంటికి పోయి పడుకుంటాను. దారిలో షాపులో అడిగి మాత్రలు కొనుక్కుపోతాను సార్!" యాదగిరి లుంగలు చుట్టుకుపోతూ చెప్పాడు.

"కానీ ఇవ్వాళ స్టూడెంట్లకు ఎగ్జామ్స్ ఉన్నాయి గదా! మీరు వెళితే ప్రాబ్లం కదా!" చికాగ్గా అన్నాడు వాదిరాజు ప్రిన్సిపల్.

"కానీ నేను ఉంటేనే వాళ్లకు ప్రాబ్లం సార్! దయుంచి ఇవ్వాళ్టికి సెలవు యివ్వండి సార్!" కళ్లనీళ్లు పెట్టుకుంటూ అడిగాడు.

అతని పరిస్థితి చూసి జాలిపడి తలూపాడు. అతను ఉండి కూడా డ్యూటీ చేయలేడు కనుక సెలవు యివ్వడమే మంచిదనిపించింది.

అతను వెళ్లిపోయిన తరువాత డి.ఇ.ఓ. ఆఫీసులో పెండింగు వున్న పని గుర్తుకొచ్చి ఫోన్ చేసి మాట్లాడాడు చాలాసేపు. ఎవరిదో దగ్గు వినిపిస్తే ఫోన్ కట్ చేసి తలెత్తి చూశాడు ఆ వైపు. ఎదురుగా డ్యాన్సు టీచరు నిర్మల ఓ భంగిమలో నిల్చునుంది. ఆమె కళ్లు ఎర్రగా ఉబ్బి వున్నాయి. ఎక్కిళ్లు పెడుతున్నది.

"అరే! ఏం జరిగింది నిర్మలగారు? ఎవరైనా పేరెంట్స్ మీ మీద అనవసరంగా కంప్లెయింట్ యిచ్చారా?" ఆశ్చర్యంగా అడిగాడు వాదిరాజు.

దానికి నిర్మల డ్యాన్సు చేస్తూ లేదని.. తలూపింది అడ్డంగా.

"మరి ఎందుకు మొహం అలా మారిపోయింది? ఓ గంట క్రితం నవ్వుతూ తుళ్లుతూ ఉన్నారే?" అసహనంగా అడిగాడు వాదిరాజు.

అందుకు ప్రతిగా హ్యాంగ్ బ్యాగ్‌లోంచి మొబైల్ తీసింది నిర్మల వయ్యారంగా

"ఆఫీసు అవర్సులో ఫోన్లు వాడకూడదని తెలియదా?" అరిచాడు.

"తెలుసు సార్! మా తమ్ముడొచ్చి చెప్పాడు, వాట్సాప్ మెసేజ్ చూసుకొమ్మని. చూడండి సార్!" అంటూ స్మార్ట్ ఫోన్ ఆన్ చేసి ఏవేవో బటన్లు నొక్కి స్మార్టుగా ఒక బొమ్మ చూపించింది ప్రిన్సిపల్‌కు, కులుకుతూ.

వాదిరాజు చూశాడు.... ఎవరినో చాప మీద పడుకోబెట్టారు. చుట్టూతా కొంతమంది జనం ఉన్నారు. భొల్లున ఏడుపులు వినిపిస్తున్నాయి.

"ఏంటిది?" చిరాగ్గా అడిగాడు ఆ దృశ్యం చూడలేక సున్నిత మనస్కుడు.

"మా నాయనమ్మ సార్! పోయింది ఇందాక, వెళ్లాలి సార్!" జాలిగా చెప్పింది.

"ఎంతుంటుంది వయసు? ఏం జబ్బు చేసింది?" కోపంగా అడిగాడు.

"వయసు సార్, ఆc... వయసు తొంభై" చెప్పింది అభినయిస్తూ నిర్మల.

"సరే! పదో రోజు పోతావా?" కొంచెం మెత్తబడి అడిగాడు వాదిరాజు.

"కాదు సార్! అర్జెంటుగా పోయి చూడకపోతే మా చుట్టాలు నన్ను వెలివేస్తారు. వెళ్లాలి సార్! సాయంత్రంలోపు కడసారి చూపు అందుకోవాలి!" కన్నీరు.

"ఏ ఊరేంటి?" జాలిపడుతూ అడిగాడు వాదిరాజు కరిగిపోయి.

"అనంతపురం సార్! ఇప్పుడు ఇంటికి పోయి సర్దుకుని బయలుదేరితేగాని మధ్యాహ్నం నాలుగుకన్నా చేరలేను. దయచేసి సెలవు యివ్వండి సార్!" ప్రార్థించింది.

"ఏంటో ఇవ్వాళ అన్ని కేసులూ యిలానే ఏడుస్తున్నాయి. ఈ రోజు అసలే స్టాఫ్ తక్కువున్నారు. పరీక్షలు! కరువులో అధికమాసంలాగా వచ్చిన వాళ్లకు ఏవో ప్రాణం మీదకొచ్చాయి. ఆల్‌రైట్! నాకెన్ని కష్టాలున్నా నీకు లీవ్ శాంక్షను చేయకపోతే నాకు మానవత్వం లేదనుకుంటారు. యూ కెన్ గో!" అయిష్టంగానే సెలవు మంజూరు చేశాడు వాదిరాజు.

నిర్మల ఆనందంగా ఒక్క గెంతు గెంతి కృతజ్ఞతలు అభినయించి సెలవు తీసుకుంది.

మెరుపుతీగ వెళ్లినట్లయింది.

మరునాడు వాదిరాజు నిన్న తను అటెండ్ అయిన మీటింగులో తన మాటలు ప్రెస్‌లో వచ్చాయో లేదోనని లోకలు పేపర్లు తిరగేస్తున్నాడు. కొన్ని బాగానే కవరు చేశాయి. తృప్తి పడి పక్కన పెట్టాడు. అలా ఒక ప్రముఖ లోకల్ పేపరును మడిచి పెడుతున్నప్పుడు అతని దృష్టి ఒక ఫోటోను ఆకర్షించింది. పరిశీలనగా చూసి ఉలిక్కిపడ్డాడు. వెంటనే కోపంతో అటెండరును పంపి యాదగిరిని, నిర్మలను పిలిపించాడు.

ఇద్దరూ వినయంగా వచ్చి ఆయన ఎదుట నిల్చున్నారు. నిర్మల అభినయంతో నమస్కార బాణం పెట్టింది.

"మీ ఇద్దరికీ ఒకరోజు జీతం కట్ చేస్తున్నాను ఈ నెలలో!" కోపంగా చెప్పాడు వాదిరాజు.

"సార్! సెలవులు ఉన్నాయి సార్! లాస్‌ఆఫ్ పే ఎందుకు?" కంగారుగా అడిగాడు యాదగిరి.

"సార్! నానమ్మ అంతిమ యాత్రలో పాల్గొనడం తప్పా?" అంటూ నిర్మల నాట్యం చేసింది. కలకంఠి ఒక కంట కన్నీరు ఒలికించింది.

"యాదగిరీ! నిన్న నువ్వు ఏకపాత్రాభినయం పోటీలకు జడ్జిగా వెళ్లావు ఆత్మకూరుకు; నిర్మలా! నువ్వు డ్యాన్సు పోటీలకు జడ్జిగా అదే చోటికి వెళ్లావు. స్కూలు ఎగ్గొట్టి యిలా పర్సనల్ పనులు చేసుకోవడం తప్పు!"

వాదిరాజు మాటలకు బిత్తరపోయి నిర్మల "నువ్వు చెప్పావా?" అన్నట్టు యాదగిరికేసి అభినయించింది.

ఇది వీడికెలా తెలిసిందని యాదగిరి దుర్యోధనుడి ఫోజు పెట్టాడు. వాదిరాజు తన ముందున్న లోకల్ పేపర్‌ను వాళ్ల మొహాల మీదికి విసిరికొట్టాడు. ఆ పేపర్‌లో ఆత్మకూరులో జరిగిన సాంస్కృతిక పోటీల గురించి, న్యాయనిర్ణేతలుగా పాల్గొన్నవారి గురించి, విజేతలతో న్యాయనిర్ణేతలు దిగిన ఫొటో ప్రచురింపబడింది.

దానితో యాదగిరి, నిర్మల అవాక్కై పోయారు. ■

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3

సెల్స్: 9885446501/ 9885449458

స్థంభ వేధ అని దేనినంటారు?

సి.పి - హైదరాబాద్

'స్థంభ వేధ' గురించి వివరించండి.

'స్థంభ వేధ'లో పలు రకాలున్నాయి. అందులో ముఖ్యమయినవి రెండు. గృహ నిర్మాణంలో స్థంభాలు(పిల్లర్స్) బేసి సంఖ్యతో కూడి వున్నప్పుడు (1,3,5,7,9 మొ॥) కలిగే వేధను 'స్థంభ వేధ' అంటారు. పాత గృహ నిర్మాణ క్రమంలో గృహం నాభి స్థానంలో స్థంభం (పిల్లర్) వేయటం నిషేధిం పబడింది. ఆ స్థానమునందు స్థంభం వేయటం వలన 'స్థంభ వేధ' దోషం ప్రాప్తించి చెడు ఫలితాలను పొందేవారు. ఇప్పుడు అలాంటి గృహ నిర్మాణ క్రమం లేదు. ఈశాన్య మూలన శంకుస్థాపన గావిం పబడుతున్నది. నిర్మాణావసరాలను బట్టి నాభి స్థానంలో కూడా స్థంభం వేస్తున్నారు. నాభి స్థానంనందు శంకుస్థాపన చేయటం లేదు. కాబట్టి అక్కడ స్థంభం వేయటం దోషంగా పరిగణింపబడటం లేదు.

2) 'స్థంభ హీన వేధ': తగినన్ని స్థంభాలు లేకుండా కొద్ది (బేసి) స్థంభాలతో మాత్రమే గానీ, పారు దప్పిన స్థంభాలతోగానీ నిర్మాణం ఉండినట్లయితే ఆ గృహానికి 'స్థంభ హీన వేధ' అనే వాస్తు దోషం ఏర్పడు తుంది. ఇలాంటి దోషం వున్నప్పుడు సంతాన హీనం, కళత్ర హీనం, దీర్ఘవ్యా ధులు కలిగే అవకాశం వుంది. ఎవరికయినా పైన చెప్పిన చెడు ఫలితాలు పునరావృతం అవుతున్నట్లయితే 'స్థంభ వేధ' లేదా 'స్థంభ హీన వేధ' అనే దోషం వారి ఇంటికి వున్నదేమోనని ఒకసారి పరిశీలించుకోవాలి. ఇలాంటి దోషం వున్నప్పుడు దానిని తగిన రీతిలో సవరించుకున్నట్లయితే ఆ వాస్తు దోషం తొలగిపోయి మంచి ఫలితాలను పొందవచ్చు.

ఏ దిక్కు గృహం యోగిస్తుంది?

శశిభూషణరావు - తూ.గో.జిల్లా

ప్రశ్న: నా పేరు శశిభూషణరావు. ఈ పేరుతో ఏ దిక్కు గృహం పనికొస్తుంది?

జవాబు: మీ వ్యవహారనామరీత్యా మీకు ఉత్తర ముఖ ద్వారం యోగిస్తుంది. ఒకవేళ స్వతంత్ర గృహం తీసుకున్నా, కట్టినా ఉత్తరం వీధి వుండి, ఉత్తర ముఖ ద్వారం వుండాలి. ఉత్తర ఈశాన్య ముఖ ద్వారం వుండవచ్చు. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొన్నట్లయితే ఆ కాంప్లెక్స్‌కి వీధి ఎటువైపు వున్నప్పటికీ మీరు కొనాలనుకుంటున్న ఫ్లాట్‌కి ఉత్తరం కానీ ఉత్తర ఈశాన్య ముఖద్వారం వుంటే మీకు చక్కగా యోగిస్తుంది.

ఏ విధమైన మార్పులు చేయాలి?

రాజేశ్వరరావు - ప్రకాశం జిల్లా

ప్రశ్న: గురువుగారూ! మా ఇల్లు చాలా పాతది. దాదాపు శిథిలావస్థలో వున్నది. పై కప్పు, గోడలు కూడా అప్పట్లో 'దంగు సున్నం'తో కట్టారు. అక్కడక్కడ పెచ్చులూడి పోతున్నాయి. గోడలు పగుళ్లు బారి వున్నాయి. ఇక్కడ పరిస్థితి ఏమీ బాగాలేదు. ఇలాంటి ఇంట్లో వుంటున్నందుకే మాకు ఈ కష్టాలన్నీ దాపురిస్తున్నాయేమోనిపిస్తుంది. ఇంటి ప్లాను పంపిస్తున్నాను. ఏ మార్పులు చేయమంటారు? దయచేసి మాకు మంచి పరిస్థితులు కలిగేలా మార్పులు సూచించండి.

జవాబు: ఎంతో కాలం దృఢంగా వుండే ఇళ్లు వుంటాయి. అలాగే త్వరగా శిథిలమయ్యే ఇళ్లు కూడా వుంటాయి. ఇల్లు కట్టేటప్పుడు తీసుకునే జాగ్రత్తలమీద నాణ్యత ప్రమాణాల మీద ఆధారపడి ఇంటి దృఢత్వం తీరు వుంటుంది. మీరు వివరించిన తీరునుబట్టి ఈ ఇల్లు జీర్ణావస్థకు చేరువుగా వున్నట్లు తెలుస్తుంది. 'దంగు సున్నం'తో కట్టిన ఇళ్లు కూడా చాలా కాలం మన్నికతోనే వుంటాయి. మీ ఇల్లు కట్టి ఎంత కాలమయిందో తెలుపలేదు. ఇల్లు గట్టిగా వుండి అక్కడ క్కడ పెచ్చులూడి పోతుంటే మామూలు పునరుద్ధరణ కార్యక్రమం సరిపోతుంది. చాలా పాత ఇల్లయితే ఈ చిన్న చిన్న మార్పులు, చేర్పుల వలన గొప్పగా ఫలితాలుండవు. మార్పులు చేస్తూ కాలయాపన గావించటంవల్ల రిస్కు పెరుగుతుంది. కాబట్టి మీరు పూర్తి గృహాన్ని పునర్నిర్మించుకోవటమే ఉత్తమం. అంతవరకు ప్రస్తుతమున్న ఇంటికి తూర్పు ఈశాన్యంలో ఒక ద్వారాన్ని (3 అడుగులు, 3 అంగుళాలు 3 వెడల్పు) ఏర్పాటు గావించండి. చాలావరకు ఉపశమనం కలిగే అవకాశముంటుంది.

తలుపులు ప్రతిష్ఠించేటప్పుడు ముహూర్తం చూడాలా?

శారద - విజయనగరం

ప్రశ్న: గృహ నిర్మాణం గావించేటప్పుడు మంచి ముహూర్తం చూసుకొని ఒకసారి శంకుస్థాపన గావిస్తాం కదా. మళ్లీ తలుపులు ప్రతిష్ఠించేటప్పుడు కూడా ముహూర్తం చూసుకోవాలా?

జవాబు: తప్పకుండా! శంకుస్థాపన చేసినప్పుడు గాకుండే బోరు/బావి తీసేటప్పుడు, స్లాబు వేసేటప్పుడు, తలుపులు నిలబెట్టేటప్పుడు గృహ ప్రవేశ సమయంలో కూడా మంచి ముహూర్తాలు చూసుకోవాలి. శంకుస్థాపన తరువాత ప్రతి పిల్లరూ వేసేటప్పుడు ముహూర్తం చూసుకునే అవసరం వుండదు. ప్రధాన ద్వారం నిలబెట్టేటప్పుడు ముమూర్తం చూసుకోవాలి. ప్రతి ద్వారానికి ముహూర్తం చూడాల్సిన పని లేదు. ఒక్కో స్లాబు వేస్తున్నప్పుడు ప్రతి స్లాబుకీ మంచి ముహూర్తం చూసుకోవాలి.

లెట్రిన్‌కు ఎదురుగా పూజగది!?

ప్రశాంతరావు - కదిరి

ప్రశ్న: దక్షిణ ఆగ్నేయ గేటు పెద్దది పెట్టాలా? ఈ ప్లానులో దక్షిణ ఆగ్నేయంలో వున్న గేటుకు ఇంటి ఆగ్నేయ కోణం తగులు తుంది. దోషమా? దక్షిణ ఆగ్నేయ గేటును కొద్దిగా ఆగ్నేయం వైపు మారుద్దామంటే దాని ఎదురుగా ఈశాన్యంలో వస్తుంది. ఏమి చేయాలి? దక్షిణ ఆగ్నేయం గేటు చిన్నగా పెట్టకూడదా? రెండు బెడ్ రూమ్స్‌కి మధ్యలో లెట్రిన్ కట్టాం. దానికి ఎదురుగా పూజగది వచ్చింది. అది సరైందా? కాదా?

జవాబు: గృహం ఆగ్నేయపు కోణాలు దక్షిణంలో పెట్టే గేటులోకి రాకూడదు. ఆ కోణానికెదురుగా గేటు పిల్లరు వేసి అక్కడి నుండి ప్రారంభమయ్యేలా పూర్తి గేటు ఎటువైపు అయినా నిర్మించుకోవచ్చు. గేటు దక్షిణం కంటే దక్షిణ ఆగ్నేయం శ్రేష్ఠం. పైన తెలిపిన పద్ధతి సరిపడే విధంగా చిన్న గేటు కూడా పెట్టుకోవచ్చు. తప్పకుండా పెద్ద గేటు పెట్టాల్సిన అవసరం లేదు.

గృహం లోపలి టాయిలెట్‌కెదురుగా పూజాగది నిర్మించకూడదు. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: ---

పుట్టినతేదీ:-------------------- ఊరు: ---------------

జన్మనక్షత్రం:---------తల్లిపేరు:-----------------------

చిరునామా: --

------------------- ఫోన్: ------------------------

కౌన్సెలింగ్ అంటే ఇంతేనా?!!

పర్సనల్ పాయింట్
చల్లా సుబ్రహ్మణ్యం
సైకాలజిస్ట్ - హైదరాబాద్

1 బి-401, హేమదుర్గ టవర్స్, మియాపూర్,
1 సి-ఇక్బాల్ టవర్స్, నారాయణగూడ,
ఫోన్: 9866362224
challascounsel@gmail.com
www.challascounsel.com
Subrahmanyam Challa

- కె.కె.ఆర్ - ఒంగోలు

ప్రశ్న: నమస్కారం చల్లాగారూ! నేను ఒక గవర్నమెంట్ టీచర్ని. నాకు కౌన్సెలింగ్ (counselling) పట్ల చాలా అభిప్రాయాలు ఉన్నాయి. మీరు చేసే కౌన్సెలింగ్ ఇంతేనా..." ఏమైనా సమస్యల్లో వున్న వ్యక్తి మీ దగ్గరకు వస్తే ఆ సమస్యకు పరిష్కారం చెప్పడమే మీరు చేసే కౌన్సెలింగ్ అవునా?

జవాబు: ఇల్లు కట్టడంలో సమస్యలు రాకుండా ఓ ఆర్కిటెక్ట్-ఇంజినీర్ (Architect-Engineer) సలహా చెప్తారు. ఆరోగ్య సమస్యలకు డాక్టర్ (Doctor), న్యాయ సమస్యలకు లాయర్ (Lawyer) పరిష్కారాలు సూచిస్తారు. మనిషి జీవితం సమస్యల వలయం. ఏ సమస్యనైనా ఎదుర్కొని పరిష్కారాన్ని సాధించగలిగే శక్తి ప్రతి మనిషిలోనూ వుంటుంది. అయితే సమస్యలో మునిగితే లుతూ, అందులోనే సతమతమయ్యే మనిషికి తనలోని ఆలోచనా శక్తినీ, విచక్షణనూ మేల్కొలిపే, చైతన్యవంతం చేసి, పరిష్కారాన్ని కనుక్కోగలిగే సామర్థ్యం తక్కువగా వుంటుంది. అంటే పూర్తిగా సమస్యలో కూరుకుపోయి వున్న మనిషి ఆ సమస్య గురించి సమర్థవంతంగా ఆలోచించలేడు. దాంతో ప్రతి సమస్య మానసిక ఆందోళనకు గురి చేస్తుంది. ఆ ఆందోళన తీవ్రత వారి వారి సంయమన స్థాయి (degree of balance)ని బట్టి వుంటుంది. నిజానికి ఆ ఆందోళనకు సరైన కారణాన్ని కూడా వారు గుర్తించగలిగే స్థితిలో వుండరు. ఆ పరిస్థితుల్లోనే కౌన్సెలింగ్ అవసరం ఏర్పడుతుంది. ఆ వ్యక్తి మానసిక ఆందోళనకు అసలైన కారణాన్ని గుర్తించి, సమస్య తీవ్రతను తెలుసుకుని, ఆ సమస్యపట్ల సరైన అవగాహనను కలగజేసి, అతనిలోని విశ్లేషణాశక్తి (analysis) నిద్ర లేపి, వాస్తవాల్ని గ్రహించగలిగే మానసిక స్థాయిని కలిగించి, సమర్థవంతంగా తన సమస్యకు పరిష్కారాన్ని తనే కనిపెట్టగలిగే విధంగా ఆ వ్యక్తిని తయారు చేయడమే అసలైన కౌన్సెలింగ్. కానీ తనకు తోచిన పరిష్కారం చెప్పే వ్యక్తి కౌన్సెలర్ కాదు. అది కౌన్సెలింగ్ అవదు.

పెళ్లాం తంతే పడాలా?

- సి.సి.ఎస్ - విశాఖపట్నం

ప్రశ్న: నా వయసు 31. నా భార్య వయసు 27. మా పెళ్లై రెండేళ్లు దాటింది. మాది అరేంజ్డ్ మ్యారేజ్. నాది సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం. నా ఉద్యోగం చూసి నా భార్య తల్లిదండ్రులు నా వెంటబడి మరీ నన్ను వాళ్లకి అల్లుడ్ని చేసుకున్నారు. వాళ్లు ఇవ్వాల్సిన లాంఛనాలు, కట్నకానుకలు బాగానే ఇచ్చారు. మేమూ మా స్థోమతనుబట్టి రిసెప్షన్ ఇచ్చాం.

నా భార్యకు కోపం, ఆవేశం, అసహనం ఎక్కువ. వాళ్ల ఇంట్లో తనే అందరికన్నా చిన్న (ఒక్కగానొక్క కూతురు కూడా). డబ్బు బాగా వుందని పొగరు. కట్నం బాగా ఇచ్చామని గర్వం. మొన్నీ మధ్య ఇంట్లోకి ఒక వస్తువు కొనే విషయంలో గొడవ జరిగింది. ఎప్పుడూ తన ఇష్ట ప్రకారమే చేసే నేను ఈసారి మాత్రం నేను అనుకున్నదే జరగాలని పట్టుబట్టాను. దాంతో మాటా-మాటా పెరిగి నా మీద చెయ్యి చేసుకుంది (చెంపమీద). నా అదృష్టం బాగుండటంతో ఎవరూ చూడలేదు. ఇది జరిగి రెండు నెలలవుతుంది. ఈ విషయాన్ని నేను మర్చిపోలేకపోతున్నాను. తను సారీ చెప్పిందిగానీ నా అహం దెబ్బ తిన్నది. ఏం చేయాలి?

